E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 02-02-2026 (వారం) సోమవారం సంపుటి: 02 || సంచిక: 33|| పేజీలు–6 www.ekaburu.com



కేంద్ర పన్నుల్లో తెలంగాణ వాటా రూ.33,180 కోట్లు » 4లో

## ప్రభాకర్‌రావు సర్వీసు పొడిగింపులో మతలబేంటి?



- ఉద్యోగ విరమణ అనంతరం ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఆయనే ఎందుకు!
- ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌ను విచారించిన సిట్
- పోలీస్ శాఖ ప్రతిపాదన మేరకే జరిగిందన్న మాజీ సీఎం

ఈకబురు, హైదరాబాద్: ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సిట్ విచారించే ప్రక్రియ ఆదివారం ఉత్కంఠ పరిణామాల మధ్య కొనసాగింది. భారాస శ్రేణుల ఆందోళనల నడుమ.. హైదరాబాద్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలోనే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆయన్ని విచారించింది. మధ్యాహ్నం 3 గంటలకు మొదలైన విచారణ నాలుగున్నర గంటల సేపు సాగింది. విచారణ క్రమంలో సిట్ పలు ప్రశ్నలు అడిగి కేసీఆర్ వాంగ్మూలాన్ని నమోదు చేసింది. ముఖ్యంగా ఈ కేసులో నిందితులు ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావుల పునర్నియామకాలతోపాటు ప్రణీత్‌రావు పదోన్నతి గురించి కేసీఆర్‌ను అడిగినట్లు తెలిసింది. ఉద్యోగ విరమణ పొందిన అనంతరం ప్రభాకర్‌రావును కొనసాగించాల్సిన అవసరంపై ప్రశ్నించినట్లు సమాచారం. ఎవరినైనా పునర్నియమిస్తే సాధారణంగా రెండేళ్లకే అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని.. కానీ ప్రభాకర్‌రావుకు మాత్రం మూడేళ్లు పొడిగింపు ఇవ్వడం వెనక మతలబేంటి..?

తరువాయి 2లో

# వృద్ధి పథాన..కేంద్ర బడ్జెట్



- దీర్ఘకాలిక పురోగతిని లక్షిస్తూ కేంద్ర బడ్జెట్
- జనాకర్షక ప్రకటనలకు దూరం
- తయారీరంగంలో ఉద్యోగాల సృష్టికి అధిక ప్రాధాన్యం
- మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట
- మునుపెన్నడూ లేనంతగా మూలధన వ్యయానికి రూ. 12.22 లక్షల కోట్లు
- ఆదాయపు పన్ను శ్లాబుల్లో మార్పుల్లేవ్
- రక్షణ రంగానికి కేటాయింపులు 15% పెంపు
- వీబీ జీ రామ్ జీ పథకానికి రూ. 95,692 కోట్లు
- సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌ను ముందుకు తీసుకెళ్తామన్న నిర్మల

**ఈ కబురు, డిల్లీ :**

అంతర్జాతీయంగా అనిశ్చితి మేఘాలు కమ్ముకున్నా.. అభివృద్ధి పథంలో దేశాన్ని వేగంగా పరుగులు తీయించాలన్న సంకల్పంతో మోదీ సర్కారు బృహత్ ప్రణాళికను రూపొందించింది! తయారీ రంగంలో స్వావలంబనతో సుస్థిర వృద్ధికి బాటలు పరిచే కార్యాచరణను సిద్ధం చేసింది!! స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తయ్యేనాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్న ప్రభుత్వం.. ఆ లక్ష్య సాధనకు అనుగుణంగా తీర్చిదిద్దిన కేంద్ర బడ్జెట్ (202627)ను ఆదివారం పార్లమెంటు ముందుంచింది. దీర్ఘకాల ఆర్థిక వృద్ధికి దన్నుగా నిలిచే మౌలిక వసతుల అభివృద్ధికి తాము ఎంతగా ప్రాధాన్యమిస్తున్నదీ భారీ కేటాయింపులతో చాటిచెప్పింది. ఔషధాలు, సెమీకండక్టర్లు సహా మొత్తం ఏడు రంగాల్లో ఉద్యోగాల సృష్టి, ఉత్పాదకత పెంపుపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నట్లు ప్రకటించింది.

తరువాయి 2లో

## భగ్గుమన్న గులాబీ దళం



కేసీఆర్‌పై సిట్ విచారణకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు
రాష్ట్రవ్యాప్తంగా భారాస శ్రేణుల బైక్ ర్యాలీలు, రాస్తారోకోలు
ముఖ్యమంత్రి దిష్టిబొమ్మల దహనం
పలు చోట్ల ఉద్రిక్తత » 3లో

## రాష్ట్రానికి తీవ్ర అన్యాయం



- బడ్జెట్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టి ధ్వజం
- 'మూసీ', మెట్రో విస్తరణకు ఏమీ ఇవ్వలేదు
- బయోఫార్మా, సెమీ కండక్టర్ పరిశ్రమలూ గుర్తుకురాలేదని వ్యాఖ్య

ఈకబురు, హైదరాబాద్: వికసిత్ భారత్ లక్ష్యాలను చేరడానికి బడ్జెట్‌లో ప్రోత్సాహం ఇవ్వాల్సింది పోయి పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. సంక్షేమంపై కేంద్రం దృష్టి సారించలేదని...ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి ఏమీ చేయలేదని ఆరోపించారు. ఉపాధి హామీ పథకానికి పూర్తిగా తూట్లు పొడవడం వల్ల గ్రామీణ పేదలకు నష్టం జరుగుతుందని విమర్శించారు. ఆదివారం ప్రజాభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. "తెలంగాణ కోసం బడ్జెట్‌లో ఏదైనా ఉంటుందని ఆశపడ్డాం. సీఎంతో సహా మంత్రులమంతా ఎంపీల బృందంతో ప్రధానిని, కేంద్ర మంత్రులను కలిశాం. మూసీ పునరుజ్జీవం, రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్), మెట్రో విస్తరణ వంటి ప్రాజెక్టులకు నిధులిస్తారనుకున్నాం.. ఏమీ ఇవ్వలేదు. బయోఫార్మా రంగంలో అయినా కేంద్రానికి తెలంగాణ గుర్తుకు రావాలి కదా. సెమీ కండక్టర్ పరిశ్రమకూ మొండిచేయి చూపారు. మరోసారి ప్రధానిని కలుస్తాం

రైజింగ్ తెలంగాణ నినాదంతో ప్రపంచంతో పోటీ పడాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే కేంద్రం ప్రోత్సహించకుండా నిర్లక్ష్యం చూపుతోంది. బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు న్యాయం చేయాలని రాష్ట్ర ఎంపీలంతా పార్టీలకు అతీతంగా మరోసారి ఆర్థికశాఖ మంత్రి, ప్రధానిని కలసి అడగాలని ప్రభుత్వం భావిస్తోంది. జీఎస్‌డీపీలో ఆర్థిక ద్రవ్యలోటు పరిమితిని 4 శాతానికి పెంచాలని కోరినా పట్టించుకోలేదు. కేంద్రానికి మాత్రం 4.3 శాతం పెట్టుకున్నారు. దానినే రాష్ట్రాలకు కూడా వర్తింపజేయాలి కదా. గేమింగ్ పరిశ్రమకు హైదరాబాద్ కేంద్రంగా ఉంది.

తరువాయి 2లో

## 2026–రీఫామ్ ఎక్స్ ప్రెస్‌కు ..కొత్త శక్తినిచ్చిన బడ్జెట్: ప్రధాని మోదీ



**ఈ కబురు, డిల్లీ :**


కేంద్ర బడ్జెట్ 202627 (Union Budget 2026) పై ప్రధాని మోదీ స్పందించారు. ఈ పద్దు 140 కోట్ల మంది ఆకాంక్షలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ఇది సంస్కరణల ప్రయాణాన్ని బలోపేతం చేస్తుందని వ్యాఖ్యానించారు. మూలధన వ్యయానికి, వృద్ధికి మధ్య సమతూకం పాటించారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై ప్రశంసలు కురిపించారు. వికసిత్ భారత్ నిర్మాణానికి మార్గనిర్దేశనం చేస్తుందని, ఇది చరిత్రాత్మక బడ్జెట్ అని కొనియాడారు. "బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు చేశారు. 2047 మిషన్ లక్ష్యాల అనుగుణంగా ఈ బడ్జెట్ ఉంది. త్వరలో ఇండియా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది" అని చెప్పారు. ప్రభుత్వ సంస్కరణల అజెండాను రీఫామ్ ఎక్స్‌ప్రెస్‌గా పిలిచిన మోదీ.. ఆ ఎక్స్‌ప్రెస్‌కు బడ్జెట్ కొత్త శక్తిని అందించిందని పేర్కొన్నారు. ఈ సంస్కరణలు యువతకు అద్భుతమైన అవకాశాలు కల్పిస్తాయన్నారు.

తరువాయి2లో

## రైల్వే హైస్పీడ్



వెనెజువెలా చమురు కొనుగోలుకు భారత్ సిద్ధం! 3లో





## తగ్గేవి.. పెరిగేవి

ఈ కబురు, దిల్లీ: కేంద్ర బడ్జెట్లో క్యాన్సర్ ఔషధాలు సహా కొన్నింటికి కస్టమ్స్ డ్యూటీ తగ్గించారు. అదే సమయంలో కొన్ని రకాల వస్తువులకు పెంచాలని ప్రతిపాదించారు. ఆ వివరాలు..

—– కొంత చౌక అయ్యేవి ఇవి..

వ్యక్తిగత వినియోగం నిమిత్తం దిగుమతి చేసుకునే ఔషధాలు, 17 రకాల క్యాన్సర్ ఔషధాలు, అత్యంత అరుదైన ఏడు రోగాల చికిత్సలో ఉపయోగించే ప్రత్యేక ఔషధాలు, ఆహారం, 2లో

## నిరంతర పర్యవేక్షణతో ఎస్సెల్బీసీ సొరంగం తవ్వకం



ఈ-కబురు, హైదరాబాద్: నిరంతర పర్యవేక్షణలో శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం తవ్వకాన్ని చేపట్టాలని, శాస్త్రీయ పద్ధతిలో, ఆధునిక పరిజ్ఞానం ఉపయోగించి పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

తరువాయి2లో

## దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా బడ్జెట్

- హైస్పీడ్ రైలు కారిడార్లు తెలంగాణ ప్రజలు గర్వించదగ్గ విషయం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ఈ కబురు, దిల్లీ: కేంద్ర బడ్జెట్ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే విధంగా ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. బడ్జెట్ ప్రకటన అనంతరం ఆదివారం దిల్లీలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..'బడ్జెట్-2026 ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుంది. రక్షణరంగాన్ని మరింత శక్తిమంతం చేస్తుంది. దేశంలో ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లు ప్రకటిస్తే అందులో మూడు హైదరాబాద్ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇది తెలంగాణ ప్రజలు గర్వించాల్సిన విషయం

తరువాయి2లో

## ఇరాన్‌పై దాడి చేస్తే 'ప్రాంతీయ యుద్ధం'

ఖమేనీ హెచ్చరిక

ఈయూ దేశాల సైన్యాలన్నీ ఉగ్రసంస్థలే!



దుబాయ్: అమెరికా తమపై దాడికి పాల్పడితే అది పశ్చిమాసియాలో ప్రాంతీయ యుద్ధానికి దారితీస్తుందని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హెచ్చరించారు. "మేం యుద్ధ ప్రేరేపకులం కాదు. కానీ తమపై దాడికి పాల్పడేవారికి ఇరాన్ గట్టిగా సమాధానం చెబుతుంది" అని ఖమేనీ అన్నారు. యుద్ధనౌకలను ట్రంప్ యంత్రాంగం రంగంలోకి దించాక ఖమేనీ ఇంత సూటిగా అమెరికాను హెచ్చరించడం ఇదే ప్రథమం.

తరువాయి3లో

ఈ-కబురు

02 - 02 -2026
సోమవారం
e-kaburu.com

# ప్రభాకర్‌రావు సర్వీసు పొడిగింపులో మతలబేంటి?



అంతటితో ఆగకుండా అసాధారణరీతిలో ఆయననే ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమించాల్సిన అవసరమేంటి?.. అర్హత లేకున్నా ఆయననే చట్టబద్ధమైన ఇంటర్‌సెప్షన్(ఎల్ఐ)కు డిజిగ్నేటెడ్ అథారిటీగా నియమించడానికి కారణమేంటి.. లాంటి ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. ఫోన్ అక్రమట్యాపింగ్‌లో ప్రభాకర్‌రావే ప్రధాన నిందితుడు కావడంతో ఈ కారణాలన్నీ కుట్ర కోణాన్ని సూచిస్తున్నాయి కదా..! అని ఆరా తీసినట్లు సమాచారం. అలాగే 2007 ఎస్సై బ్యాచ్‌లో మరెవరికీ లేకుండా ఒక్క ప్రణీత్‌రావుకు మాత్రమే డీఎస్పీగా పదోన్నతి కల్పించాల్సిన అవసరమెందుకొచ్చింది..? అని అడిగినట్లు సమాచారం. ఈ క్రమంలో వాటికి సంబంధించి పోలీస్‌శాఖ నుంచే ప్రతిపాదన వచ్చిందని కేసీఆర్ చెప్పినట్లు తెలుస్తోంది. అలాగే భారాసకు కోట్ల రూపాయల విరాళాలు ఎలక్ట్రానిక్ బాండ్ల రూపంలో వచ్చాయని.. అలా ఇచ్చిన వారి ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేసినట్లు ఉండటంలో మతలబేమిటని ప్రశ్నించి వివరాలు రాబట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు 'ఎమ్మెల్యేలకు ఎర' కేసులో బహిర్గతమైన ఆడియో టేపులు మీకు ఎవరిచ్చారని సిట్ కేసీఆర్‌ను ప్రశ్నించినట్లు సమాచారం.

**రెండో అంతస్తు గదిలో విచారణ**

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని నందినగర్ నివాసంలోనే విచారిస్తామంటూ ముందుగానే సిట్ నోటీస్ ఇచ్చిన క్రమంలో కేసీఆర్ ఆదివారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని నివాసం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.30 సమయంలో నందినగర్ ఇంటికి చేరుకున్నారు. ఆయన వెంట కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావులు మినహా ఇతర నాయకులెవరినీ లోపలికి అనుమతించలేదు. మధ్యాహ్నం 3 గంటలకు సిట్ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. కేసీఆర్ నివాసం రెండో అంతస్తులోని గదిని సిట్ విచారణ కోసం ఎంపిక చేశారు. విచారణ సమయంలో ఇంట్లో కేటీఆర్, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌రావు, న్యాయవాది రాంచందర్‌రావులను మాత్రమే అనుమతించడంతో హరీశ్‌రావు తదితరులంతా తెలంగాణ భవన్‌కు వెళ్లారు. విచారణ సమయంలో కేసీఆర్ మినహా మిగిలినవారంతా ఇతర గదుల్లో ఉండాలని సిట్ పంపేసినట్లు సమాచారం. విచారణ ప్రక్రియ మొత్తాన్ని ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు.

విచారణ పూర్తయ్యాక.. కేసీఆర్‌కు సంఘీభావంగా నందినగర్‌లోని ఆయన నివాసం వద్దకు చేరుకున్న పార్టీ కార్యకర్తలు, అభిమానులు

**పటిష్ఠంగా భద్రత..**

విచారణ నేపథ్యంలో సిట్ చీఫ్ సజ్జనార్ ఉదయం నుంచే ఐసీసీసీలో ఉండి పరిస్థితిని సమీక్షించారు. హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల బృందం కేసీఆర్ నివాసానికి వెళ్లి విచారించింది. ఈ బృందంలో దర్యాప్తు అధికారి వెంకటగిరితోపాటు మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, గ్రేహౌండ్స్ ఎస్పీ రవీందర్‌రెడ్డి, శంషాబాద్ అదనపు డీసీపీ కేఎస్‌రావు, మహంకాళి ఏసీపీ శ్రీధర్ ఉన్నారు. విచారణ అనంతరం ఈ బృందం ఐసీసీసీలో సజ్జనార్‌తో సమావేశమైంది. కేసీఆర్ నివాసం, పరిసర ప్రాంతాలు, సమీపంలోని తెలంగాణ భవన్ వద్ద పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, క్విక్ రియాక్షన్ టీమ్, ఇంటెలిజెన్స్ తదితర విభాగాలకు చెందిన దాదాపు 500 మంది అధికారులు, సిబ్బందిని ఆ ప్రాంతంలో మోహరించారు. కేసీఆర్ నివాసానికి వెళ్లే దారుల్లో మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు.

**నిరసనలు.. ఆందోళనలు.. ఉద్రిక్తత**

కేసీఆర్‌ను సిట్ విచారించే క్రమంలో.. ఉదయం నుంచే పెద్దఎత్తున భారాస నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. కేసీఆర్ నివాసంతోపాటు సమీపంలోని తెలంగాణ భవన్ వద్దకు పెద్దఎత్తున చేరుకున్నారు. ఆయా ప్రాంతాలతోపాటు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) భవనం వద్ద వందల సంఖ్యలో పోలీసులు మోహరించారు. సిట్ విచారణ ప్రారంభమై.. రెండు గంటల తర్వాత భారాస శ్రేణులు ఆందోళనకు ఉపక్రమించాయి. సీఎం నివాసం, మంత్రుల నివాస సముదాయంతోపాటు ఐసీసీసీని ముట్టడించేందుకు ప్రయత్నిస్తున్నారనే సమాచారంతో పోలీసులు కట్టడికి యత్నించారు. భారాస శ్రేణుల్ని తెలంగాణ భవన్ నుంచి బయటికి రానీయకుండా ఆపేయడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో పలువురిని అదుపులోకి తీసుకొని వ్యాన్లలో అక్కడి నుంచి తరలించారు. అదే సమయంలో ఓ న్యూస్‌ఛానెల్ కెమెరామేన్‌పై భారాస శ్రేణులు దాడికి ప్రయత్నించారు. నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి వెళ్లేందుకు భారాస శ్రేణులు చేసిన యత్నాలనూ పోలీసులు అడ్డుకున్నారు. రాష్ట్ర సచివాలయం ప్రాంతంలో సీఎం దిష్టిబొమ్మలను దహనం చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**వర్గల్ మండలం గౌరారం గ్రామంలో కేసీఆర్ కాన్వాయ్ వెంట భారాస శ్రేణులు**

పార్టీ నేతలతో కేసీఆర్ సమాలోచన

విచారణ అనంతరం కేసీఆర్ న్యాయనిపుణులతో చర్చించారు. తర్వాత.. కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మధుసూదనాచారి, ప్రవీణ్‌కుమార్‌లతో ప్రత్యేకంగా సమావేశమై.. విచారణాంశాలు, తదుపరి పరిణామాలపై చర్చించినట్లు తెలిసింది. మున్సిపల్ ఎన్నికలపై కూడా మాట్లాడినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో పార్టీ బలంగా ఉందని, ముమ్ముందు భారీగా చేరికలుంటాయని చెప్పినట్లు తెలిసింది. బరిలో రెబెల్స్ లేకుండా చూసుకోవాలని సూచించారు. విచారణ పూర్తయిందని తెలియగానే.. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున తెలంగాణ భవన్ నుంచి కేసీఆర్ నివాసానికి చేరుకున్నారు. వారంతా.. 'లీడర్ లీడర్', జై కేసీఆర్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. రాత్రి 8.40 గంటల సమయంలో కేసీఆర్ బయటకు వచ్చి.. బాల్కనీ నుంచి పార్టీ శ్రేణులకు చేతులెత్తి నమస్కరించారు. పిడికిలి ఎత్తి అభివాదం చేశారు. తర్వాత 9.45 గంటలకు బయలుదేరి ఎర్రవల్లికి తిరిగి వెళ్లిపోయారు.

**ఎర్రవల్లి నుంచి దారిపొడవునా నీరాజనం**

ఈనాడు, సంగారెడ్డి, న్యూస్‌టుడే, ములుగు: అంతకుముందు ఉదయం నుంచే పార్టీ కార్యకర్తలు, నాయకులు.. ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసానికి చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కక్షపూరితంగానే సిట్ నోటీసులు జారీ చేసి వేధిస్తోందని ఆరోపించారు. సిట్ విచారణకు బయలుదేరేముందు.. కేసీఆర్ చేతికి బాల్యమిత్రుడు జహంగీర్ దట్టీ కట్టారు. హైదరాబాద్‌కు బయలుదేరిన కేసీఆర్‌కు దారి పొడవునా భారాస శ్రేణులు నీరాజనం పలికాయి. వంటిమామిడి వరకు కేసీఆర్ కాన్వాయ్ వెంట కార్యకర్తలు ర్యాలీగా అనుసరించారు. దారి పొడవునా ఆయన కారుపై పూలు చల్లి అభిమానం చాటుకున్నారు. వంటిమామిడి వద్ద గుమ్మడికాయతో దిష్టి తీశారు. అక్కడి నుంచి పోలీసులు స్థానిక నాయకుల వాహనాలను ఆపివేశారు.

**వ్యక్తిగత జీవితాలపై ఫోన్ ట్యాపింగ్ చేసినందునే విచారణ**

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

'కేసీఆర్ సహా ఎవరిమీదా కక్షసాధింపు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉండదు. ఎవరైనా అలా భావిస్తే అది వారి ఆలోచన మాత్రమే. నేను మాట్లాడితే ఫోన్ ట్యాపింగ్ విచారణను ప్రభావితం చేసినట్లవుతుంది. దేశరక్షణ కోసం ఫోన్ ట్యాపింగ్ చేయాల్సింది వదిలేసి వ్యక్తుల మీద, వ్యక్తిగత జీవితాల మీద చేశారని వచ్చిన ఫిర్యాదులపైన విచారణ జరుగుతోంది. నా ఇష్టాయిష్టాల ప్రకారం విచారణ జరగదు. ప్రజాస్వామ్యయుతంగా పాలన అందించడమే మా ప్రభుత్వ ఏకైక లక్ష్యం'

**చట్టం ముందు అందరూ సమానమే**

**పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్**

'చట్టం ముందు అందరూ సమానమే. పదేళ్ల భారాస పాలనా కాలంలో జరిగిన అరాచకాలపై విచారణలు జరుగుతున్నాయి. కేటీఆర్, హరీశ్, సంతోష్‌కు ఇచ్చినట్లే కేసీఆర్‌కు సిట్ నోటీసులిచ్చింది. సిట్ ద్వారా వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉంది. చట్టం తన పని తాను చేసుకుని పోతుంటే నిందలు వేయడం ఎందుకు? కేసీఆర్ సిట్ విచారణపై డీసీసీ అధ్యక్షులు స్పందించి ప్రజలకు వాస్తవాలు వివరించాలి'

భారాస ఎందుకు హడావుడి చేస్తోంది

**మంత్రి శ్రీహరి**

'ఫోన్ ట్యాపింగ్‌లో కేసీఆర్ ఏ తప్పూ చేయకపోతే భారాస ఎందుకు హడావుడి చేస్తోంది? విచారణకు హాజరుకావడానికి కార్లతో కాన్వాయ్‌లు ఎందుకు? ఇజ్రాయెల్ నుంచి ట్యాపింగ్ పరికరాలను కేసీఆర్‌కు తెలియకుండా తీసుకొచ్చారా? గతంలో ఎంతో మంది ముఖ్యమంత్రులు, మాజీ సీఎంలు విచారణకు హాజరయ్యారు''

**ఎన్నికల్లో లబ్ధి కోసమే భారాస రాద్ధాంతం**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్**

**'పురపాలిక ఎన్నికల్లో లబ్ధి కోసమే కేసీఆర్ విచారణపై భారాస రాద్ధాంతం చేస్తోంది. ఆధారాలు లేకుండా సిట్ ఎవరిని విచారణకు పిలవదు. తప్పు చేసినవారు ఎవరూ చట్టం నుంచి తప్పించుకోలేరు.**

---

## 2026–రీఫామ్ ఎక్స్‌ప్రెస్‌కు ..కొత్త శక్తినిచ్చిన బడ్జెట్: ప్రధాని మోదీ



**భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మాత్రమే ఉండిపోవాలని భారతీయులు అనుకోవడం లేదని, సాధ్యమైనంత వేగంగా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇక ఈ పద్దు మహిళా సాధికారతకు నిదర్శనంగా ఉందని, వరుసగా తొమ్మిదిసార్లు దీనిని లోక్‌సభలో ప్రవేశపెట్టి నిర్మలాసీతారామన్ రికార్డు సృష్టించారని ప్రధాని మోదీ కొనియాడారు.**

---

# వృద్ధి పథాన..కేంద్ర బడ్జెట్




మొత్తం రూ.53.47 లక్షల కోట్ల ఈ కేంద్ర పద్దులో.. రక్షణ, గ్రామీణాభివృద్ధి సహా పలు రంగాలకు కేటాయింపులు నిరుటితో పోలిస్తే గణనీయంగా పెరిగాయి. ఆదాయపు పన్ను రేట్లను మాత్రం యథాతథంగా ఉంచారు. కొత్త ఆదాయపు పన్ను చట్టం2025 ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది.

--ఉపాధి కల్పన.. ఉత్పాదకత పెంపు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ఉదయం తొలుత రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిశారు. బడ్జెట్ ప్రతులను ఆమెకు అందజేశారు. అనంతరం అక్కడి నుంచి లోక్‌సభకు వచ్చి.. రికార్డు స్థాయిలో వరుసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. విత్త క్రమశిక్షణను పాటిస్తూ.. తాత్కాలిక ప్రయోజనాలకు కాకుండా, దీర్ఘకాలిక వృద్ధికి పద్దులో నిర్మల ప్రాధాన్యమిచ్చారు. పర్యాటకం, ఔషధ ఉత్పత్తి, రక్షణ తదితర రంగాల్లో దేశాన్ని అగ్రగామిగా నిలబెట్టే ప్రణాళికలను ఇందులో పొందుపరిచారు. దాదాపు 90 నిమిషాలపాటు ఆమె ప్రసంగించారు. ట్రంప్ సుంకాల బెదిరింపులతో ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో భౌగోళికరాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతుండటం, సరఫరా గొలుసులకు అంతరాయాలు ఏర్పడుతుండటం, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కుదుపులకు లోనవుతుండటం వంటి పరిణామాలను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్‌లో నిర్మల కీలక ప్రకటనలు చేశారు. ఉపాధి కల్పన, ఉత్పాదకత పెంపు, సాంకేతికత ఆధారిత అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ.. ఔషధాలు, సెమీకండక్టర్లు, రేర్ ఎర్త్ మ్యాగ్నెట్‌లు, రసాయనాలు, క్యాపిటల్ గూడ్స్, జౌళి, క్రీడా సాధనాల ముడిపదార్థాల వంటి రంగాల్లో స్వదేశంలో ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచుతామన్నారు. దేశీయంగా ఐఫోన్ తయారీ విజయవంతమైన నేపథ్యంలో.. ఎలక్ట్రానిక్స్ తయారీకి కేటాయింపులను నిరుటితో పోలిస్తే ఈ బడ్జెట్‌లో రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించారు. మొత్తం రూ.40 వేల కోట్లను అందుకు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

**––రయ్‌రయ్ రైల్వే**

గత రెండేళ్లూ రైల్వేకు ఒకే స్థాయిలో నిధులు కేటాయించిన నిర్మలమ్మ.. ఈసారి కేటాయింపులను 10 శాతానికి పైగా పెంచారు. దేశంలో ఏడు హైస్పీడ్ రైల్వే కారిడార్ల ఏర్పాటుకు సంకల్పించారు. వీటిలో మూడు హైదరాబాద్ నుంచి ఉంటాయి. పశ్చిమ బెంగాల్‌లోని డాంకునీ, గుజరాత్‌లోని సూరత్ మధ్య నిర్మించే నడవాను సరకు రవాణాకు ప్రత్యేకంగా కేటాయిస్తారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన వీబీ జీ రామ్ జీ పథకానికి రూ.95,692 కోట్లు కేటాయించారు. చేపల పెంపకం, పాడి వంటి వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించేలా ముఖ్యమైన ప్రకటనలు చేశారు. భారత్ నుంచి అంతర్జాతీయంగా డేటా సెంటర్ సర్వీసులను అందించే విదేశీ సంస్థలకు 20 ఏళ్లపాటు పన్ను విరామం ప్రకటించడం తాజా బడ్జెట్‌లోని మరో కీలకాంశం. జీఎస్టీ సరళీకరణ, నూతన కార్మిక చట్టాల రూపకల్పన సహా 350కిపైగా సంస్కరణలను తాము ఇప్పటికే అమల్లోకి తీసుకొచ్చామని.. సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌ను ఇదే జోరుతో ముందుకు తీసుకెళ్తామని నిర్మల చెప్పారు. లోక్‌సభలో బడ్జెట్ ప్రసంగం వింటున్న ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, శివరాజ్‌సింగ్ చౌహాన్, సర్బానంద సోనోవాల్, ధర్మేంద్ర ప్రధాన్, జైశంకర్, పీయుష్ గోయల్, కిరణ్ రిజిజు, ప్రహ్లాద్ జోషి, అశ్వినీ వైష్ణవ్; కిషన్‌రెడ్డి, మన్‌సుక్ మాండవీయ, జితేంద్ర సింగ్, అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ తదితరులు

**––పటిష్ఠ 'రక్షణ'**

రక్షణ రంగంలో ఆధునికీకరణకు అగ్రతాంబూలమిస్తూ.. ఆ శాఖకు కేటాయింపులను నిరుటితో పోలిస్తే ఈసారి పద్దులో ఏకంగా 15% పెంచారు. స్టెమ్ కోర్సులను అభ్యసించే విద్యార్థినులకు ఇబ్బందులు తలెత్తకుండా నివారించేందుకు జిల్లాకో వసతిగృహం ఏర్పాటుచేస్తామని, స్వయంసహాయక సంఘాల సభ్యురాళ్లను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం కోసం 'షీమార్ట్'లను ఏర్పాటుచేస్తామని ప్రకటించి.. మహిళా సంక్షేమంపై తమ చిత్తశుద్ధిని కేంద్రం చాటుకుంది. భారత్‌ను బయోఫార్మా తయారీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాబోయే ఐదేళ్లలో రూ.10 వేలకోట్ల పెట్టుబడులు పెట్టనున్నారు. రోగులకు భారీ ఊరటనిస్తూ 17 క్యాన్సర్ ఔషధాలపై దిగుమతి సుంకాన్ని తొలగించింది.

ఆహారం, ఇంధనం, ఎరువులపై రాయితీల కోసం చేయబోయే వ్యయంలో కేంద్రం నిరుటితో పోలిస్తే 4.47% కోత విధించింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ వంటి కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నా పద్దులో ప్రభుత్వం జనాకర్షక పథకాల జోలికి వెళ్లలేదు. ఆర్భాటాలు, విప్లవాత్మక ప్రకటనలకు దానిలో స్థానమివ్వలేదు. ప్రధానంగా దీర్ఘకాలిక వృద్ధిని దృష్టిలో పెట్టుకొని వ్యవహరించింది. మూలధన వ్యయం కోసం మునుపెన్నడూ లేనంతగా ఏకంగా రూ.12.2 లక్షల కోట్లు కేటాయించింది. వృద్ధికి ఊతమివ్వడం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, ప్రగతి పథంలో అందరినీ కలుపుకొని వెళ్లడం.. అనే మూడు కర్తవ్యాలకు కట్టుబడి ఉంటూ తాజా బడ్జెట్‌ను రూపొందించినట్లు కేంద్రం ఉద్ఘాటించింది.

---

# నిరంతర పర్యవేక్షణతో ఎస్ఎల్‌బీసీ సొరంగం తవ్వకం



ఆదివారం సచివాలయంలో పలు నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతిపై అధికారులు, ఇంజినీర్లతో ఆయన సమీక్షించారు. 'సొరంగం నిర్మాణంలో ప్రమాదాలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించింది. సొరంగ మార్గం పూర్తి చేయడానికి చేపట్టిన హెలీబోర్న్ ఏరియల్ ఎలక్ట్రో మ్యాగ్నటిక్ సర్వే నివేదిక అందింది. పనులు పూర్తి చేయడానికి ప్రత్యేకంగా ఎస్ఎల్‌బీసీకి ఒక డివిజన్ ఏర్పాటు చేయడంతోపాటు ఆపరేషన్ బృందానికి ప్రత్యేకంగా సీఈని నియమించాలి. సొరంగంలో పరిణామాలను అంచనా వేయడానికి భూ భౌతిక సాంకేతిక బృందాలను ఏర్పాటు చేయాలి.పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు సింగరేణి కాలరీస్ కంపెనీకి చెందిన నిపుణులు భాగస్వాములవుతారు. ఇకపై పనుల్లో జాప్యాన్ని సహించేది లేదు. కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు వేగవంతం చేయడానికి అవసరమైన సాంకేతిక సంస్థలను, డిజైనర్ కన్సల్టెంట్ ఎంపిక పూర్తి చేయాలి. సీడబ్ల్యూపీఆర్ఎస్, ప్రాజెక్టు డిజైనర్లతో అధికారులు సమన్వయం చేసుకోవాలి. అప్పుడే ఎన్డీఎస్ఏ నుంచి పునరావాస డిజైన్లకు దశలవారీగా అనుమతులు సులువుగా వస్తాయి. ఈ నెల 16 తరువాత ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీతో బ్యారేజీల పునరుద్ధరణపై సమావేశం నిర్వహించాలి' అని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా డ్యామ్ రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం కింద తెలంగాణకు కేంద్రం కేటాయించిన రూ.100 కోట్ల నిధులకు సంబంధించిన వివరాలను మంత్రి ఆరా తీసినట్లు తెలిసింది. సమావేశంలో శాఖ సలహాదారు పరీక్షిత్ మెహ్రా, పరిపాలన, ఓఅండ్ఎం ఈఎన్సీలు రమేశ్‌బాబు, శ్రీనివాస్, రామగుండం సీఈ రమేశ్‌గుప్తా, నల్గొండ ఎస్ఈ భద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తగ్గేవి.. పెరిగేవి

--ఇవి చురుక్కుమనిపిస్తాయి

సిగరెట్లు, దిగుమతి చేసుకున్న తక్కువ ధర గొడుగులు (కనీసం రూ.60 పెంపు), పొటాషియం హైడ్రాక్సైడ్, ఏటీఎం యంత్రాలు, వాటి విడిభాగాలు, విదేశీ సిబ్బంది ఫిల్మ్, బ్రాడ్‌కాస్టింగ్ పరికరాలు, జూ కోసం దిగుమతి చేసుకునే జంతువులు, పక్షులు, అమోనియం ఫాస్ఫేట్ / నైట్రోఫాస్ఫేట్ ఎరువులు, నాఫ్తా వంటి ఎరువుల ముడి పదార్థాలు, కాఫీ రోస్టింగ్, బ్రూయింగ్, వెండింగ్ యంత్రాలు, నూనె తీసిన ఆముదపు చెక్క (కాస్టర్ ఆయిల్ కేక్), ఖనిజాలు, ఇనుప ధాతువు, బొగ్గు

## దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా బడ్జెట్

అభివృద్ధిలో దూసుకుపోతున్న హైదరాబాద్ నగరానికి మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు రావడం సంతోషకరం. బడ్జెట్‌లో ప్రకటించిన బయోఫార్మా శక్తి కార్యక్రమం ద్వారా హైదరాబాద్ నగరానికి మేలు జరుగుతుంది. ఎరువుల సబ్సిడీకి గతంకంటే రూ.7 వేల కోట్ల కేటాయింపులు పెరిగాయి. తెలంగాణకు పన్నులవాటా 13.5% పెరిగింది. భారతీయ వస్త్రపరిశ్రమకు చేయూతనివ్వాలని కేంద్రం నిర్ణయించడంవల్ల వరంగల్ మెగా టెక్స్‌టైల్‌పార్క్‌కు ఎంతో మేలు జరుగుతుంది. జిల్లాకో బాలికల హాస్టల్ ప్రకటించినందున తెలంగాణలోని 33 జిల్లాలకు 33 హాస్టళ్లు వస్తాయి. హైదరాబాద్‌లాంటి నగరాలకు రూ.వెయ్యికోట్లకు మించి మున్సిపల్ బాండ్లు రైజ్ చేయగలిగితే కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.100 కోట్ల ప్రోత్సాహకం లభిస్తుంది. రాష్ట్రప్రభుత్వం మెట్రో విలీన కార్యక్రమాన్ని పూర్తిచేసి రెండోదశకు తగిన డీపీఆర్ అందిస్తే కేంద్ర ప్రభుత్వం నిధుల విడుదలపై నిర్ణయం తీసుకుంటుంది' అని తెలిపారు.

రెండేళ్లుగా ఫోన్ ట్యాపింగ్ సాగదీత

ఫోన్‌ట్యాపింగ్ కేసు దర్యాప్తును సాగదీస్తున్నారని, కాంగ్రెస్, భారాస పార్టీలపై ప్రజల్లో విశ్వాసం పోయిందని కిషన్‌రెడ్డి విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో భాజపా మంచి ఫలితాలను సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



---

# రాష్ట్రానికి తీవ్ర అన్యాయం



అయినా ఈ నగరంపై దృష్టి పెట్టలేదంటే తెలంగాణ ఏం తప్పు చేసింది? దేశంలో హైదరాబాద్ మెడికల్ హబ్‌గా ఉంది. ఇతర దేశాల నుంచి సైతం ఇక్కడికి రోగులు వస్తున్నారు. ప్రాంతీయ మెడికల్ హబ్‌ల ఏర్పాటులో కూడా రాష్ట్రానికి చోటు లేదు. నగరంలో 56 కిలోమీటర్ల దూరం మూసీ పునరుజ్జీవంతో ఇన్‌ల్యాండ్ వాటర్ ప్రాజెక్టు కోసం నిధులు ఇవ్వాలని ప్రధానిని సైతం అడిగాం. అయినా బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారు.

రేర్ ఎర్త్ ఖనిజాల ఉత్పత్తిని పట్టించుకోలేదు

రామప్ప వంటి అద్భుత దేవాలయాలతో పాటు, టైగర్ రిజర్వులు, ఇరువైపులా నదులు, జలపాతాల వంటివి అనేకమున్నా రాష్ట్రానికి టూరిజం నిధుల కేటాయింపులో కూడా పట్టించుకోకపోవడం బాధాకరం. రేర్ ఎర్త్ ఖనిజాలపై దృష్టి సారించే అవకాశమున్న ప్రతిచోటుకు అన్ని ప్రభుత్వ రంగ సంస్థలు వెళ్లాలని ప్రయత్నం చేస్తున్నా పట్టించుకోలేదు. సత్తుపల్లి, రామగుండం వంటి ప్రాంతాల్లో సింగరేణి తవ్విన మట్టిలో ఇవి ఉన్నాయి. మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో సెమీ కండక్టర్లపై కొన్ని దేశాలు గుత్తాధిపత్యం సాధించే పరిస్థితి వస్తోంది. ఆయా దేశాలు సరఫరా చేస్తే తప్ప ఎలక్ట్రానిక్ పరికరాలు ఉత్పత్తి చేసే పరిస్థితి ఉండదు. అటువంటి పరిస్థితి నుంచి మనదేశం బయటపడాలనే రేర్ ఎర్త్ ఖనిజాల ఉత్పత్తికి తెలంగాణకు అవకాశం ఇవ్వాలని కోరా. దీనివల్ల దేశానికి ఉపయోగమని కేంద్రానికి చెప్పాం. అయినా పట్టించుకోలేదు. మూడు రైలు మార్గాలు మాత్రమే ఇచ్చినా...ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడటానికి కనీసంగా రావాల్సినవి రాలేదు'' అని ఉప ముఖ్యమంత్రి భట్టి తెలిపారు.

# నల్లగండ్లలో పర్యటించిన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**ఓటర్ ఐడి రిజిస్ట్రేషన్ కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికుల వినతి**

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్లలో గల పలు కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలలో ఆదివారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అపర్ణ సైబర్ స్కేప్ గేటెడ్ కమ్యూనిటీ వాసులు రోడ్డు ప్రమాదాల సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు వేయించాలని కోరారు. ఈ ప్రాంతంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. దీంతో పాటు ఈ ప్రాంతంలో ఎంతో మంది కొత్తగా నివాసం ఉంటున్నారని, ఇక్కడ చాలా మందికి ఓటర్ ఐడి కార్డులు లేవని, వెంటనే ఓటర్ రిజిస్ట్రేషన్ కేంద్రం ఏర్పాటు చేయించాలని కోరారు. స్థానికుల వినతికి సానుకూలంగా స్పందించిన గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల భద్రత, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ తన ప్రథమ కర్తవ్యమని, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు విషయమై వెంటనే సంబంధిత జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యను వివరించారు. ఓటర్ ఐడి రిజిస్ట్రేషన్ క్యాంపు ఏర్పాటు చేయడంపై కూడా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టడమే తన లక్ష్యమని కార్పొరేటర్ తెలిపారు. గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధికి, ప్రజల భద్రతకు, మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అపర్ణ సైబర్ స్కేప్ కమ్యూనిటీ ప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.


నల్లగండ్లలో పర్యటిస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి


అపర్ణ గేటెడ్ కమ్యూనిటీ వాసులతో కార్పొరేటర్ సమావేశం

# పాలన చేతకాక ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలు
## మాజీ కార్పొరేటర్ సాయిబాబా


**తెలంగాణ భవన్ కు తరలి వెళ్లిన శేరిలింగంపల్లి బీఆర్ఎస్ శ్రేణులు**

ఈకబురు, శేరిలింగంపల్లి : పాలన చేతకాక, అధికార కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను సీట్ విచారణకు పిలవడంపై నిరసన వ్యక్తం చేస్తూ శేరిలింగంపల్లి బీఆర్ఎస్ శ్రేణులు సాయిబాబా ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం తెలంగాణ భవన్ కు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే తెలివి లేక, ప్రజల దృష్టిని మళ్లించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర రాజకీయాలకు తెరలేపారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై కేసీఆర్ ముద్ర చెరిపేస్తే చెరిగిపోదని.. దశాబ్దాల తెలంగాణ ప్రజల కలలను సాకారం చేసి రాష్ట్రాన్ని సాధించిన ఘనత తెలంగాణ జాతిపిత కేసిఆర్ దని అన్నారు. కేసీఆర్ ను సిట్ విచారణకు పిలవడం ముమ్మాటికీ డైవర్షన్ పాలిటిక్స్ లో భాగమేనని అన్నారు. అధికారులు సైతం కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా మారుతున్నారని దుయ్యబట్టారు. సాగునీటి ప్రాజెక్టులతో అపర భగీరథుడిగా మారి తెలంగాణ రైతుల భూములను సస్యశ్యామలం చేసిన ఘనత కెసిఆర్ దని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కుట్ర కోణాలను తెలంగాణ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర ప్రజలు తగిన విధంగా సమాధానమిస్తారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసిగిపోయారని మరోసారి కెసిఆర్ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. బీఆర్ఎస్ భవన్ కు తరలి వెళ్లిన వారిలో శేరిలింగంపల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


టిఆర్ఎస్ నాయకులతో కలిసి తెలంగాణ భవన్ కు తరలి వెళ్తున్న సాయిబాబా


ముఖ్య నాయకులతో తెలంగాణ భవన్ లో సమావేశమైన సాయిబాబా

# ఇరాన్‌పై దాడి చేస్తే 'ప్రాంతీయ యుద్ధం'



అయితే అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై బలప్రయోగం చేస్తారా లేదా అన్నది ఇంకా ఇదమిత్థంగా తేలలేదు. ఇరాన్ తమతో చర్చలకు సిద్ధమవుతోందంటున్న ట్రంప్, టెహ్రాన్ అనుసరిస్తున్న అణ్వాయుధ విధానం వల్ల తలెత్తుతున్న సమస్యను కూడా తానే పరిష్కరిస్తానని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్ సైతం హర్మూజ్ జలసంధిలో ఆది, సోమవారాల్లో వ్యూహాత్మక సైనిక కసరత్తు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ కసరత్తు సమయంలో తమ యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలకు ముప్పు కలిగించే ధోరణిని అనుసరిస్తే ఊరుకునేది లేదని అమెరికా సైనిక కేంద్ర కమాండ్ హెచ్చరించింది. మరోవైపు ఇరాన్‌లో జరిగిన దేశ వ్యాప్త నిరసన ప్రదర్శనలను ఒక కుట్రగా ఖమేనీ అభివర్ణించారు.

యూరోపియన్ యూనియన్ సభ్యదేశాల సైన్యాలన్నిటినీ తాము ఉగ్రవాద సంస్థలుగా పరిగణిస్తామని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘేర్ ఖాలిబాఫ్ ప్రకటించారు.

అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ దేశాల నాయకులు అశాంతికి ఆజ్యం పోస్తూ తమ దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తున్నారని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ వ్యాఖ్యానించారు. అయితే, అగ్రరాజ్యంతో తాము యుద్ధం కోరుకోవడం లేదన్నారు.

# పార్లమెంటుకు రూ.1,492 కోట్ల నిధులు



ఈ కబురు, పార్లమెంటు ఉభయ సభల నిర్వహణకు గాను 202627 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రూ.1,492 కోట్లు కేటాయించింది. ఈ మొత్తంలో లోక్‌సభ స్పీకర్, ఉపసభాపతి వేతనాలు, భత్యాలకు రూ.1.56కోట్లు, పార్లమెంటు సభ్యుల జీతభత్యాలు, ఇతర సదుపాయాల కోసం రూ.416.45 కోట్లు, సంసద్ టీవీకి నిధులు, లోక్‌సభ సచివాలయం ఖర్చులు, అధికారులు, సిబ్బంది జీతాలకు రూ.586.03 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. రాజ్యసభ నిర్వహణతో పాటు సిబ్బంది, అధికారుల జీతాలు, భత్యాలకు రూ.482.99 కోట్ల వ్యయాన్ని అంచనా వేసింది. రాజ్యసభ ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్ జీతభత్యాలకు రూ.2.55 కోట్లు, విపక్ష నేత జీతభత్యాలు, ఆయన కార్యాలయ నిర్వహణకు రూ.3.36కోట్ల వ్యయాన్ని బడ్జెట్ పద్దుల్లో ప్రభుత్వం పేర్కొంది.

**మైనారిటీ వ్యవహారాల శాఖకు రూ.3,400 కోట్లు**

202627 కేంద్ర బడ్జెట్‌లో మైనారిటీ వ్యవహారాల శాఖకు రూ.3,400 కోట్లను ఆర్థిక మంత్రి కేటాయించారు. 202526 బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం రూ.3,350 కోట్లు కాగా సవరించిన అంచనాల తర్వాత అది రూ.2,160.45 కోట్లకే పరిమితమైంది. దీని ప్రకారం చూస్తే కొత్త బడ్జెట్‌లో రూ.1,240 కోట్లు అధికంగా కేటాయించినట్లయ్యింది.

# వెనెజువెలా చమురు కొనుగోలుకు భారత్ సిద్ధం!

**న్యూయార్క్: వెనెజువెలా నుంచి చమురు దిగుమతులకు భారత్ ముందుకొచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వెనెజువెలాకు చైనా ఇచ్చిన అప్పును తిరిగి చమురు రూపంలో పొందనుందా.. అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ "చమురు విషయంలో ఒప్పందం కుదుర్చుకోవడానికి మేము చైనాను స్వాగతిస్తున్నాం, మేము ఇప్పటికే వెనెజువెలాతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాం. ఇందులో భారత్ కూడా చేరనుంది. భారత్ ఇకపై ఇరాన్ నుంచి కాకుండా వెనెజువెలా నుంచి చమురును దిగుమతి చేసుకుంటుంది. దీనికి సంబంధించిన ఒప్పందంపై ఒక అవగాహనకు వచ్చాం" అని ట్రంప్ తెలిపారు. అయితే, దీనిపై భారత్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.క్యూబాతో చర్చలు జరుపుతాం..క్యూబా నాయకులతో చర్చలు జరపనున్నామని, ఆ దేశంపై ఒత్తిడి పెంచుతున్నామని ట్రంప్ అన్నారు. క్యూబాకు చమురు సరఫరాను నిలిపివేయడం ద్వారా చర్చల వైపుగా దాన్ని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది మానవీయ సంక్షోభంగా మారాల్సిన అవసరం లేదని, క్యూబా కచ్చితంగా తమ వద్దకు వచ్చి ఒప్పందం కుదుర్చుకుంటుందని ట్రంప్ అన్నారు. అప్పుడు క్యూబా మళ్లీ స్వేచ్ఛ పొందుతుందన్నారు.**



# భగ్గుమన్న గులాబీ దళం

ఈ కబురు, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా..భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సిట్ విచారించడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా భారాస శ్రేణులు ఆదివారం పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టాయి. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా రాస్తారోకోలు చేశారు. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేశారు. మోటార్ సైకిల్ ర్యాలీలు చేపట్టారు. నల్లజెండాలు ధరించి నినాదాలు చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్ వద్దకు భారీగా భారాస నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి.. నినాదాలు చేశారు. హైదరాబాద్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. నందినగర్‌లోని కేసీఆర్ నివాసం వద్దకు వెళ్లబోయిన కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. నిరసనగా నల్ల జెండాలతో ఆందోళన చేపట్టారు. రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. తెలంగాణభవన్‌లో సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, తలసాని, మధుసూదనాచారి, కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, రాగిడి లక్ష్మారెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేసీఆర్‌పై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని బాలాపూర్ చౌరస్తాలో, మీర్‌పేటలో చేపట్టిన నిరసనల్లో మాజీ మంత్రి సబితారెడ్డి పాల్గొన్నారు. పెద్ద అంబర్‌పేటలో జాతీయ రహదారిపై ధర్నాతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. భారాస విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాసయాదవ్ నేతృత్వంలో హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌ను ముట్టడించగా.. పోలీసులు అరెస్టు చేశారు. సిరిసిల్లలో భారాస నేతలు, కార్యకర్తలు..సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిద్దిపేటలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా నల్లబ్యాడ్జిలతో నిరసన కార్యక్రమాలు జరిగాయి. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు, నల్ల జెండాలతో బైక్ ర్యాలీ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల ఊరేగింపులతో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. నారాయణపేట జిల్లా మద్దూరు మున్సిపల్ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేశారు. వరంగల్ చౌరస్తాలో రోడ్డుపై నిరసన వ్యక్తంచేస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్ సహా పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ కార్యకర్తలు రాస్తారోకో చేశారు. ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌ల నేతృత్వంలో నల్ల జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైఠాయించారు. మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నేతృత్వంలో కార్యకర్తలు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు.

నల్గొండలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి నేతృత్వంలో..సూర్యాపేట జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో బైకు ర్యాలీలు చేశారు. నిజామాబాద్‌లో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నేతృత్వంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఆర్మూర్‌లో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో మెడలో నల్ల కండువాలు ధరించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో పోలీసులు, భారాస కార్యకర్తల మధ్య తోపులాట చేసుకుంది. ముంబయి జాతీయ రహదారిపై సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ వద్ద భారాస నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి.. శాసనమండలి మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్‌తో కలిసి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కొత్తగూడెంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ చేపట్టారు.

**ఖమ్మంలో తోపులాట....సీఐ చేతికి ఫ్రాక్చర్**

ఖమ్మంలో భారాస ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి ఇల్లెందు క్రాస్‌రోడ్డు వరకు ప్రదర్శన చేపట్టారు. అక్కడ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నిస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. పెనుగులాటలో సీఐ చేతి ఎముక విరగడంతో వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో పలువురు భారాస కార్యకర్తలపై కేసు నమోదైంది.

**అపోహలు, అసత్యాల సృష్టికే ఈ విచారణ**
**–ఈ కేసులో లీకులే తప్ప.. ఆధారాల్లేవు**
**–కుండబద్దలు కొట్టినట్లు కేసీఆర్ సమాధానమిచ్చారు: కేటీఆర్**

''ప్రజల్లో అపోహలు, అసత్యాలు సృష్టించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ విచారణ నిర్వహిస్తోంది. ఈ కేసులో లీకులే తప్ప.. ఆధారాల్లేవు. ఫోన్ ట్యాపింగ్ కేసులో డొల్లతనం క్రమంగా బయటపడుతోంది. ఎలాంటి తప్పు జరగలేదని తేటతెల్లమైంది. సిట్ అధికారులు చట్టాన్ని గౌరవించలేదు. అయినా సరే.. విచారణకు కేసీఆర్ సంపూర్ణంగా సహకరించారు. సిట్ విచారణ ఎర్రవల్లిలోనే జరిపే విషయంపై కోర్టుకు వెళ్తే.. మాకు అనుకూలంగా తీర్పు వచ్చేది. చట్టం, న్యాయంపై గౌరవంతో అలా చేయలేదు'' అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ విచారణ పూర్తయిన అనంతరం నందినగర్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

--సిట్ పీసీసీ అధీనంలో ఉందా?

''ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి సిట్ 1, 2, 3 పేరిట విచారణ కొనసాగిస్తోంది. కేసీఆర్ మీద బురద చల్లాలనుకుంటే.. అది తిరిగి మీ మొహం మీదే పడుతుంది. మున్సిపల్ ఎన్నికల్లో మేం పోరాడుతుంటే.. మా ఏకాగ్రతను దెబ్బతీయడానికి ఈ కాకమ్మ కథలు తయారు చేసి.. కేసీఆర్‌ను విచారిస్తున్నారు. ఈ విచారణ చేసేది సిట్టా?.. పీసీసీనా?.. భాజపానా? సిట్ పీసీసీ అధీనంలో ఉందా?.. అర్థం కావడంలేదు. కేసీఆర్ మీద మీరు చేస్తున్న ఈ చిల్లర ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారు. కాళోజీ చెప్పినట్టు ఉప్పు పాతర వేసే బాధ్యత కూడా ప్రజలే తీసుకుంటారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను నేను ఒక్కటే అడుగుతున్నా. రాహుల్‌గాంధీ, సోనియాగాంధీలను ఈడీ విచారణకు పిలిస్తే.. మీ ముఖ్యమంత్రి, మీరు వెళ్లి.. రాజ్‌భవన్ ముందు ఎందుకు ధర్నాలు చేశారు? మేం కూడా అందుకే ధర్నా చేశాం.

**––కాంగ్రెస్, భాజపాలతో రాష్ట్రానికి తీరని నష్టం**

కాంగ్రెస్, భాజపాల అసమర్థత వల్ల రాష్ట్రానికి అన్యాయం జరుగుతోంది. కేంద్ర బడ్జెట్‌లో ఈసారి కూడా ఏమీ దక్కలేదు. ముఖ్యమంత్రి 5060 సార్లు దిల్లీకి వెళ్లి వచ్చినా ఫలితమే లేదు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి. పొద్దున్నే తుపాకీతో కాల్చి రూ.లక్షలు ఎత్తుకెళ్లినా పట్టించుకునే వారే లేరు. గంజాయి స్మగ్లర్లు ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను వాహనంతో ఢీకొట్టి చంపినా దిక్కులేదు'' అని కేటీఆర్ విమర్శించారు. సిట్ అధికారులు కేసీఆర్‌ను ఏం అడిగారని ఒక విలేకరి ప్రశ్నించగా.. ''నాకు తెలిసినంత వరకు కేసీఆర్‌ను 'ట్యాపింగ్ జరిగిందా?' అని అడిగి ఉంటారు. 'అలాంటిది ఏదీ జరగలేదు.. అంతా బోగస్ సృష్టి' అని కేసీఆర్ చెప్పి ఉంటారు. ఎందుకంటే మమ్మల్ని కూడా అవే ప్రశ్నలు అడిగారు. సిట్ మళ్లీ పిలిచినా వెళ్తాం. సహకరిస్తాం. మేం ఏ తప్పూ చేయలేదు'' అని కేటీఆర్ సమాధానమిచ్చారు.

**––కేసీఆర్ అంటే తెలంగాణ**

సిట్ విచారణను నిరసిస్తూ కేటీఆర్ 'ఎక్స్'లో స్పందించారు. ''దిల్లీ ఒత్తిళ్లకు తలొగ్గని వ్యక్తి కేసీఆర్. తెలంగాణ కోసం సాగిన సుదీర్ఘ పోరాటంలో సెకను కాలం కూడా పక్కకు తప్పుకోని ధీశాలి. ఈ రాష్ట్రం కోసం ఎన్ని కష్టాలు ఎదురైనా వెనకడుగు వేయని వ్యక్తి. చిల్లర రాజకీయాలకు, నీచమైన ఎత్తుగడలకు వణికిపోయే వ్యక్తి కాదు. ఎంత విషం చిమ్మినా.. ఆయనను ఎవరూ ఏమీ చేయలేరు. కేసీఆర్ అంటే తెలంగాణ చరిత్ర. ఆ చరిత్రలో మీరు కనీసం ఒక ఫుట్‌నోట్ కూడా కాలేరు'' అని కేటీఆర్ మండిపడ్డారు.



# రైల్వే హైస్పీడ్

**–మూలధన వ్యయంగా రూ.2.77 లక్షల కోట్లు**

**–హైదరాబాద్ నుంచి మూడు కారిడార్లు**



రైలు బండి వేగాన్ని పెంచడానికి నిర్మలమ్మ సంకల్పించారు. దేశంలో ఏడు అధిక వేగ నడవాలు (హైస్పీడ్ కారిడార్లు), సరకు రవాణాకు ఒక ప్రత్యేక కారిడార్ నిర్మించడానికి బడ్జెట్లో కేటాయింపులు చూపించారు. రైలుమార్గాల నిర్మాణం, ఇంజిన్లు/ వ్యాగన్లు/ కోచ్‌ల కొనుగోలు సహా మొత్తంగా రూ.2,77,830 కోట్లను రైల్వేకు మూలధన వ్యయం కింద కేటాయించాలని బడ్జెట్లో ప్రతిపాదించారు. రైల్వేకు కేటాయింపుల్లో ఇదే అత్యధికం. మొత్తంగా రైల్వే ఆదాయం రూ.3,85,733 కోట్లు, వ్యయం రూ.3,82,186 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. అదనంగా బడ్జెటేతర నిధులుగా రూ.15,000 కోట్లు అందనున్నాయి. మొత్తంగా రూ.3,547 కోట్ల మిగులు సాధించనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్ తో పోలిస్తే కొత్త కేటాయింపులు 10.25% ఎక్కువ. "ఆస్తులు సృష్టించడానికి, కొత్త పనులకు నిధులు ఇవ్వడానికి సరిపడినంత ఆదాయం రైల్వేకు సొంతంగా ఉండటం లేదు. అందుకే ప్రభుత్వం అదనంగా నిధులు ఇస్తుంది. ఆ ప్రకారం ఈసారి మూలధన వ్యయంగా రూ.2.77 లక్షల కోట్లు ఇవ్వాలని ప్రతిపాదించారు" అని రైల్వే అధికారి ఒకరు వివరించారు. రైళ్లు ఢీకొనకుండా నిరోధించే కవచ్ వ్యవస్థ విస్తరణకు ప్రాధాన్యం లభించనుందని చెప్పారు.

**--పర్యావరణ హితంగా మారుతాయి: నిర్మల** దేశంలో రవాణాను వేగవంతం చేయడానికి ఏడు హైస్పీడ్ కారిడార్లను కొత్త బడ్జెట్లో ప్రతిపాదించారు. ముంబయిపుణె, పుణెహైదరాబాద్, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై, దిల్లీవారణాసి, వారణాసిసిలీగుడీ, డాంకునీ (పశ్చిమబెంగాల్) సూరత్ మధ్య ఇవి రానున్నాయి. వీటిలో డాంకునీసూరత్ మధ్య నిర్మించేదానిని సరకు రవాణాకు ప్రత్యేకంగా కేటాయిస్తారు. సుదూర ప్రయాణాల విషయంలో పర్యావరణహితమైన రవాణా వ్యవస్థగా ఈ కారిడార్లు మారుతాయని ఆర్థికమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

**--అధిక మొత్తం పింఛన్లకే...** 202425 ఆర్థిక ఆర్థిక సంవత్సరంలో రైల్వే వ్యయం రూ.3.32 లక్షల కోట్లు, ఆదాయం రూ.3.35లక్షల కోట్లుగా ఉంది. తద్వారా రూ.3,316.45 కోట్ల మిగులు సాధించింది. ఆ ఏడాది రైల్వే చేసిన ఖర్చులో అధిక మొత్తం (రూ.58,844.07 కోట్లు) ఉద్యోగుల పింఛన్లకే వెళ్లింది. ఇది 202627లో ఇది రూ.74,500 కోట్లకు చేరుతుందని అంచనా.

# జౌళి రంగానికి ఊతం..

**–మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదన**

**–ఖాదీ, చేనేత, హస్తకళల బలోపేతానికి 'మహాత్మాగాంధీ గ్రామ స్వరాజ్'**



దేశంలో శ్రమ ఆధారిత జౌళి రంగానికి ఊతమిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర పథకాన్ని ఆదివారం ప్రకటించింది. మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటును ప్రతిపాదించింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ఈ విషయాలు వివరించారు. మంత్రి పేర్కొన్న 5 అంశాలతో కూడిన సమగ్ర పథకం ఇలా ఉంది..

1. పట్టు, ఉన్ని, జనపనార వంటి సహజ పోగుల విషయంలో స్వావలంబన సాధించేందుకు 'జాతీయ ఫైబర్ పథకం' చేపట్టడం. 2 సంప్రదాయిక జౌళి క్లస్టర్ల ఆధునికీకరణలో భాగంగా యంత్రాలకు పెట్టుబడి సాయం, సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధికి తోడ్పాటు, ఉత్పత్తుల సాధారణ పరీక్ష.. ధ్రువీకరణ కేంద్రాలు ఏర్పాటుచేయడం. 3. చేనేత పనివారికి, చేతివృత్తుల వారికి మద్దతు అందించి వారికి సంబంధించిన ప్రస్తుత పథకాలను బలోపేతం చేయడానికి జాతీయ చేనేత, హస్తకళల కార్యక్రమం. 4. అంతర్జాతీయ పోటీకి నిలవగలిగే సమగ్ర జౌళి, దుస్తుల ఉత్పాదకత అభివృద్ధికి 'టెక్స్ ఎకో ఇనీషియేటివ్' ప్రారంభించడం. 5. పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సమన్వయంతో వస్త్ర నైపుణ్య పర్యావరణ వ్యవస్థ ఆధునికీకరణ, స్థాయి పెంపునకు 'సమర్థ్ 2.0' పథకం. మరోవైపు ఖాదీ, చేనేత, హస్తకళల్ని బలోపేతం చేయడానికి మహాత్మాగాంధీ గ్రామ స్వరాజ్ పథకాన్ని కేంద్రం ప్రకటించింది. ఇది మన ఖాదీ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటు కల్పించేందుకు, బ్రాండ్ విలువ పెంచేందుకు సాయపడుతుంది. ఒక్కో జిల్లాకు ప్రత్యేకమైన ఒక్కో ఉత్పత్తి (వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్)ని ప్రోత్సహించడానికి కూడా ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

**--తోలు ఎగుమతుల ప్రోత్సాహానికి....** దేశంలో తోలు ఎగుమతులను ప్రోత్సహించడానికి కొన్ని నిర్దిష్టమైన ఉత్పాదకాల సుంకం రహిత దిగుమతులను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. అమెరికా విధించిన 50 శాతం అధిక సుంకాలతో ఇబ్బందులు పడుతున్న తోలు ఎగుమతిదారులకు ఈ చర్య ఊరట ఇవ్వనుంది. తోలు, వస్త్ర, సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో నిర్బంధ కాల పరిమితిని ఆరు నెలల నుంచి ఏడాదికి పొడిగిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు.

# సూది మందు వేసిన కాసేపటికే చిన్నారి మృతి

**ఈ కబురు, కామారెడ్డి;**

కుక్కకాటుకు మూడో డోసు సూది మందు వేసిన తర్వాత చిన్నారి అపస్మారక స్థితిలోకి వెళ్లి రెండు గంటల్లోనే ప్రాణాలు విడిచింది. కామారెడ్డిలో ఆదివారం జరిగిన ఈ ఘటన వివరాలను పట్టణ సీఐ నరహరి తెలిపారు. కామారెడ్డి మండలం కొటాల్‌పల్లికి చెందిన రమేష్‌అర్చన దంపతులు బతుకుదెరువు కోసం తమ ఇద్దరు పిల్లలతో కామారెడ్డి పట్టణంలోని అయ్యప్పనగర్ కాలనీలో నివాసముంటున్నారు. వీరి కుమార్తె క్రితార్స (రెండున్నరేళ్లు) గత నెల 25న బయట ఆడుకుంటుండగా కుక్క కరిచింది. వెంటనే కామారెడ్డిలోని బోధనాసుపత్రికి తీసుకెళ్లగా వ్యాక్సిన్ ఇచ్చారు. మూడో డోస్ కోసం ఆదివారం మధ్యాహ్నం చిన్నారిని తీసుకెళ్లగా డ్యూటీ డాక్టర్ వ్యాక్సిన్ వేశారు. ఇంటికి వెళ్లాక బాలిక అస్వస్థతకు గురికావడంతో దగ్గరలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పల్స్ పడిపోయిందని అక్కడి సిబ్బంది చెప్పడంతో నేరుగా బోధనాసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే క్రితార్స మరణించిందని వైద్యులు చెప్పారు. దీంతో కోపోద్రిక్తులైన కుటుంబసభ్యులు, బంధువులు ఆసుపత్రికి పెద్దసంఖ్యలో చేరుకొని ఆందోళన చేశారు. వైద్యుడి నిర్లక్ష్యంతోనే చిన్నారి మరణించిందంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పాప తండ్రి ఫిర్యాదు మేరకు విధుల్లో ఉన్న వైద్యుడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వివరించారు. వ్యాక్సిన్‌లతో మరణాలు సంభవించవని... పాప ఎలా చనిపోయిందో శవ పంచనామా, ఇతర దర్యాప్తు తర్వాతే నిర్ధారించగలమని బోధనాసుపత్రి పర్యవేక్షకుడు వెంకటేశ్వర్లు తెలిపారు.


# కేంద్ర పన్నుల్లో తెలంగాణ వాటా రూ.33,180 కోట్లు

**–గతేడాదితో పోలిస్తే పెరిగిన పన్నులు రూ.3,281.01 కోట్లు**

**–హైదరాబాద్ మీదుగా మూడు హైస్పీడ్ రైల్వే కారిడార్లు**

**–సింగరేణికి రూ.2,500 కోట్లు కేటాయించిన కేంద్రం**





**ఈ కబురు, న్యూఢిల్లీ:** కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు సంబంధించిన నిధుల కేటాయింపులు, పన్నుల వాటా వివరాలు వెల్లడయ్యాయి. కేంద్ర పన్నుల నుంచి రాష్ట్రానికి వచ్చే వాటాలో స్వల్ప పెరుగుదల కనిపించగా, మౌలిక వసతుల కల్పనలో భాగంగా హైదరాబాద్‌కు మూడు హైస్పీడ్ రైల్వే కారిడార్లను ప్రతిపాదించడం గమనార్హం. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్రం వసూలు చేసే పన్నుల్లో రాష్ట్రాలకు పంచే వాటా కింద ఈసారి తెలంగాణకు 2.174 శాతం ఖరారైంది. దీని ప్రకారం 2026-27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి మొత్తం రూ.33,180.78 కోట్లు రానున్నాయి. ఇందులో కార్పొరేషన్ పన్ను రూ.9,740.28 కోట్లు, ఆదాయపు పన్ను రూ.11,808.15 కోట్లు, కేంద్ర జీఎస్టీ (సీజీఎస్టీ) రూ.9,074.92 కోట్లు, కస్టమ్స్ సుంకం రూ.1,770.30 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ డ్యూటీ రూ.754.15 కోట్లు, ఇతర ట్యాక్స్‌లు రూ.32.98 కోట్లు ఉన్నాయి. కాగా గత బడ్జెట్‌లో కేంద్రం పన్నుల రూపంలో తెలంగాణకు రూ.29,899.77 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. గతేడాదితో పోలిస్తే రాష్ట్రానికి వస్తున్న పన్నుల నిధులు రూ.3,281.01 కోట్లు అధికం.

**--హైదరాబాద్‌కు మూడు 'హైస్పీడ్'మార్గాలు....** దేశవ్యాప్తంగా నగరాల మధ్య వేగవంతమైన ప్రయాణం కోసం కేంద్రం ప్రతిపాదించిన 7 హైస్పీడ్ రైల్వే కారిడార్లలో మూడు కారిడార్లు హైదరాబాద్‌ను అనుసంధానించనున్నాయి. ఇది రాష్ట్ర రవాణా రంగానికి ఊతమిచ్చే అంశం. ఈ కారిడార్లలో పుణే-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నైలు ఉన్నాయి.

**--పైలట్ ప్రాజెక్టుగా తెలంగాణ ...** కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల బదిలీలో పారదర్శకత కోసం తీసుకొచ్చిన 'ఎస్ఎన్ఏ స్పర్ష్'మాడ్యూల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయడానికి ముందు.. కేవలం ఆరు రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టారు. అందులో తెలంగాణ చోటు దక్కించుకుంది.

**--జీఎస్టీ పరిహారం లెక్కలు ఇవీ....** జీఎస్టీ అమలు వల్ల రాష్ట్రాలకు జరిగిన ఆదాయ నష్టాన్ని పూడ్చేందుకు, గతంలో కేంద్రం 'బ్యాక్ టు బ్యాక్ లోన్'పద్ధతిలో నిధులు విడుదల చేసింది. దీని కింద తెలంగాణకు 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో కలిపి మొత్తం రూ.6,949.49 కోట్లు విడుదలైనట్టు తాజా బడ్జెట్ పత్రాలు స్పష్టం చేశాయి.

**--రాష్ట్రంలోని కేంద్ర సంస్థలకు కేటాయింపులు ఇవే ...** ఈ బడ్జెట్‌లో ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజనలో భాగంగా తెలంగాణలోని బీబీనగర్ ఎయిమ్స్ సహా ఇతర ఎయిమ్స్‌లు అన్నింటికి కలిపి రూ.2,005 కోట్లు కేంద్రం కేటాయించింది. హైదరాబాద్ ఐఐటీ (ఎక్స్టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టులు)కు నిధుల కేటాయింపులో మొండి చేయి చూపించారు. కాగా తెలంగాణలోని గిరిజన యూనివర్సిటీ కోసం కేటాయింపులు ప్రత్యేకంగా చేయలేదు.

**--సింగరేణికి పెరిగిన నిధుల కేటాయింపు.....** సింగరేణి కేలరీస్ సంస్థకు రూ.2,500 కోట్లు, హైదరాబాద్‌లోని అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ సంస్థకు రూ.405.97 కోట్లు, హైదరాబాద్ సహా దేశంలోని 7 నైపర్ సంస్థలకు కలిపి గత బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించి, రూ.281.07 కోట్లకు సవరించారు. అయితే ప్రస్తుత బడ్జెట్‌లో నిధుల కోత విధించి రూ.215 కోట్లు ఏడు నైపర్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. కాగా హైదరాబాద్‌లోని ఇన్‌కాయిస్‌కు రూ.30 కోట్లు, హైదరాబాద్ సహా మరో మూడు ప్రాంతాల్లో ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ హిందీ సంస్థకు రూ.26 కోట్లు, హైదరాబాద్ సహా 12 నగరాల్లో ఉన్న సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ-డాక్)కు రూ.280 కోట్లు, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డుకు రూ.14.55 కోట్లు, స్వాతంత్ర్య సమరయోధులకు, నిజాం సంస్థాన విలీనం కోసం పోరాడిన యోధులకు (పెన్షన్లు) రూ.589.97 కోట్లు, హైదరాబాద్ జాతీయ పోలీసు అకాడమీ సహా పోలీసు విద్య, ట్రైనింగ్, పరిశోధనలకు కేటాయింపుల్లో కోత విధించి రూ.908.78 కోట్లు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించారు. అయితే హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్‌కు కేటాయింపుల్లో కోత విధించారు. మూడేళ్ల క్రితం రూ.115 కోట్లు కేటాయించి, రెండేళ్ల క్రితం బడ్జెట్‌లో కేవలం రూ.10.84 కోట్లు మాత్రమే కేటాయించిన కేంద్ర ప్రభుత్వం....గత బడ్జెట్‌లో కేవలం నామమాత్రంగా రూ.0.01 కోట్లు కేటాయించింది. కాగా ప్రస్తుత బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ (ఏఆర్‌సీఐ) సహా దేశంలోని 25 స్వయంప్రతిపత్తి కేంద్రాలన్నింటికీ కలిపి రూ.1,643.87 కోట్లు, సీడీఎఫ్‌డీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎనిమల్ బయోటెక్నాలజీ సహా దేశంలోని ఇతర స్వయంప్రతిపత్తి సంస్థలకు కలిపి రూ.1,002.13 కోట్లు, మణుగూరు సహా కోటా (రాజస్తాన్)లోని భార జల ప్లాంట్లకు రూ.1,745.52 కోట్లు కేటాయించారు.

# రెవెన్యూ, రాష్ట్రం, రంగాలవారీ గ్రాంట్ల విధానం రద్దు

**–కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 41% వాటా**

**–నికరంగా రాష్ట్రాలకు రూ.37,168 కోట్ల నష్టం**

**ఈకబురు,- హైదరాబాద్ :**





కేంద్ర వనరుల్లో రాష్ట్రాలకు పంపిణీ చేసే వాటాను 15వ ఆర్థిక సంఘం తరహాలోనే 41 శాతంగా 16వ ఆర్థిక సంఘం ఖరారు చేసింది. అయితే ఇతర గ్రాంట్లలో కోతపెట్టి బయటికి కనిపించని వాత పెట్టింది. రెవెన్యూ లోటును ఎదుర్కొంటున్న రాష్ట్రాల ఆర్థిక భారాన్ని పూడ్చేందుకు 15వ ఆర్థిక సంఘం ఇచ్చిన గ్రాంట్లను 16వ ఆర్థిక సంఘం పూర్తిగా పక్కనబెట్టింది. దీనికితోడు రంగాలవారీ, రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్లకూ తెరదించింది. దీనివల్ల గత ఐదేళ్లతో పోలిస్తే వచ్చే ఐదేళ్లలో రాష్ట్రాలు నికరంగా రూ.4,66,150 కోట్ల ఆదాయం కోల్పోనున్నట్లు తేలింది. రెవెన్యూ లోటు గ్రాంట్ల కింద 15వ ఆర్థిక సంఘం ఏపీ, అస్సాం, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, కేరళ, మణిపుర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, తమిళనాడు, త్రిపుర, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్‌లకు కలిపి ఐదేళ్ల కాలానికి రూ.2,94,514 కోట్లు సిఫార్సు చేసింది. ఇందులో ఏపీ వాటా 30,497 కోట్లుంది. ఇప్పుడు ఆ విధానాన్ని పూర్తిగా రద్దు చేయడంవల్ల రాష్ట్రాలకు కోత పడనుంది. రంగాలవారీ, రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్ల కోత కారణంగా ఆంధ్రప్రదేశ్ రూ.8,294 కోట్లు, తెలంగాణ రూ.5,386 కోట్లు నష్టపోనున్నాయి. దీని కింద మొత్తంగా అన్నిరాష్ట్రాలూ కలిపిరూ.1,71,636 కోట్లు కోల్పోనున్నాయి. మొత్తంగా 15వ ఆర్థిక సంఘంతో పోలిస్తే 16వ ఆర్థిక సంఘం హయాంలో రాష్ట్రాలు రూ.4,66,150 కోట్లు నష్టపోనున్నాయి.


**--స్థానిక సంస్థలకు పెరగనున్న గ్రాంట్లు....** 16వ ఆర్థిక సంఘం సిఫార్సుల కారణంగా స్థానిక సంస్థలకు ఐదేళ్లలో రూ.7,91,493 కోట్ల గ్రాంట్లు రానున్నాయి. దీనికితోడు ఎస్‌డీఆర్ఎఫ్ కింద రూ.1,63,521 కోట్లు, ఎస్‌డీఎంఎఫ్ కింద రూ.40,880 కోట్లు కేటాయించింది. ఈ రెండు పద్దుల కింద రాష్ట్రాలకు రూ.9,95,894 కోట్లు రానున్నాయి. 15వ ఆర్థిక సంఘం హయాంలో స్థానిక సంస్థలకు రూ.5,58,962 కోట్లే వచ్చాయి. గతంతో పోలిస్తే ఇప్పుడు రూ.4,36,932 కోట్లు పెరగనున్నాయి. 15వ ఆర్థిక సంఘం అన్ని గ్రాంట్లు కలిపి రూ.10,33,062 కోట్లు రాష్ట్రాలకు కేటాయించగా ఇప్పుడు అది రూ.9,95,894 కోట్లకు తగ్గిపోనుంది. అంటే రాష్ట్రాలు నికరంగా రూ.37,168 కోట్లు నష్టపోనున్నాయి.

**--జనాభాకే ప్రాధాన్యం.....** 16వ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు వెయిటేజీ ఇవ్వడంలో జనాభాకే ఎక్కువ మార్కులు కేటాయించింది. అదే సమయంలో డెమోగ్రఫిక్ పని తీరు, రాష్ట్ర విస్తీర్ణం, తలసరి ఆదాయ తేడాలకు మార్కులు తగ్గించింది. అయితే దేశ జీడీపీకి రాష్ట్రాలు అందించే చేయూతకు పది మార్కులు కేటాయించింది. 15వ ఆర్థిక సంఘం పరిగణనలోకి తీసుకోని ఈ కొత్తకోణాన్ని 16వ ఆర్థిక సంఘం తీసుకుని కొత్త వెయిటేజీ ఇచ్చింది. అలాగే పన్ను వసూళ్లు, ఆర్థిక క్రమశిక్షణ కోసం రాష్ట్రాలు చేసే ప్రయత్నాలను పూర్తిగా పక్కనపెట్టింది. దీనివల్ల రాష్ట్రాల వెయిటేజీలో తేడాలొచ్చాయి.

**--వెయిటేజీలో కొంత మేలు.....** 16వ ఆర్థిక సంఘం సిఫార్సులతో దక్షిణాది రాష్ట్రాలకు వెయిటేజీలో కొంత మేలు జరిగింది. 15వ ఆర్థిక సంఘం దక్షిణాది రాష్ట్రాలన్నింటికీ కలిపి 15.8% వెయిటేజీ ఇవ్వగా 16వ ఆర్థిక సంఘం దాన్ని 17.001%కి పెంచింది. దీనివల్ల కేంద్ర పన్నుల్లో ఈ రాష్ట్రాలకు నికరంగా 1.201% వాటా పెరిగింది. లెక్కల ప్రకారం చూస్తే ఈ రాష్ట్రాలు రూ.18,330.31 కోట్ల నికర ప్రయోజనం పొందాయి. జనాభాను ప్రాతిపదికగా తీసుకుని వెయిటేజీ ఇస్తే తాము నష్టపోతామని, క్రమశిక్షణతో అమలు చేసిన కుటుంబ నియంత్రణను పరిగణనలోకి తీసుకుని ప్రోత్సాహం ఇవ్వాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులంతా 16వ ఆర్థిక సంఘాన్ని కోరారు. ఇతర సామాజిక, ఆర్థిక కోణాలనూ పరిగణనలోకి తీసుకుని ఆర్థిక సంఘం ఇదివరకున్న వెయిటేజీని సవరించింది. వెయిటేజీని మార్చడంవల్ల మొత్తం 28 రాష్ట్రాల్లో 14 లబ్ధి పొందుతుండగా, మరో 14 నష్టపోనున్నాయి. వెయిటేజీ తగ్గిన రాష్ట్రాల్లో యూపీ, బిహార్, మధ్య ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, మేఘాలయ, మణిపుర్, నాగాలాండ్, గోవా, సిక్కింలు ఉన్నాయి. ప్రస్తుత లెక్కల ప్రకారం కేంద్ర వనరుల్లో వాటా అందుకునే రాష్ట్రాల్లో ఏపీ 8వ స్థానంలో (వెయిటేజీ 4.047 నుంచి 4.217 శాతానికి పెరిగింది), తెలంగాణ 16వ స్థానంలో(వెయిటేజీ 2.102 నుంచి 2.174 శాతానికి పెరిగింది) ఉన్నాయి.

# సెమీకండక్టర్ తయారీకి ఊతం..

## ఏపీ సహా పలు రాష్ట్రాల్లో రేర్ ఎర్త్ కారిడార్



దేశంలో సెమీకండక్టర్ తయారీని మరింత ప్రోత్సహించే లక్ష్యంతో ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ISM) 2.0ను కేంద్రం ప్రకటించింది. ఇందులో భాగంగా అత్యాధునిక సాంకేతిక పరికరాల ఉత్పత్తికి అవసరమైన సామగ్రి తయారీ, స్వదేశీ డిజైన్లకు ఊతమిచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ పథకానికి సంబంధించిన వ్యయాలను ప్రత్యేకంగా వెల్లడించనప్పటికీ.. సాంకేతికత, నైపుణ్యమున్న కార్మిక శక్తి కోసం పరిశోధన, శిక్షణా కేంద్రాలపై దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో స్వావలంబన సాధించేందుకు గతేడాది ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ పథకం ఈసీఎంఎస్‌ను రూ. 22వేల కోట్ల వ్యయంతో ప్రారంభించగా.. అది లక్ష్యాన్ని మించి దూసుకెళ్తోంది. ఇదే ఊపును కొనసాగించేందుకు తాజా బడ్జెట్‌లో రూ.40వేల కోట్లతో రెట్టింపు వ్యయాన్ని కేంద్రం కేటాయించింది. దేశీయ సెమీకండక్టర్ రంగ సామర్థ్యాలకు 'ఇండియా సెమీకండక్టర్ మిషన్ 1.0' మరింత పదును పెట్టింది. పరికరాల తయారీ, ఫుల్ స్టాక్ ఇండియన్ ఐపీ డిజైన్, సరఫరా గొలుసును మరింత బలోపేతం చేసేందుకు తాజాగా మిషన్ 2.0 (ISM)ను ప్రారంభించినట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

**--ఖనిజ సంపన్న రాష్ట్రాల్లో కారిడార్....** రేర్‌ఎర్త్ ఖనిజాలపై భారత్ పూర్తిగా విదేశాలపైనే ఆధారపడింది. పునరుత్పాదక ఇంధనం, అధునాతన పరికరాల తయారీ, రక్షణ రంగాల్లో కీలక విభాగాలకు అవసరమైన ఖనిజాల కోసం చైనా సహా కొన్ని దేశాలపై అధికంగా ఆధారపడుతోంది. ఈ క్రమంలో కీలక చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. రేర్ ఎర్త్ ఖనిజ నిల్వలున్న ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, కేరళ రాష్ట్రాల్లో ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. తద్వారా మైనింగ్, ప్రాసెసింగ్, పరిశోధన, రేర్ ఎర్త్ పర్మినెంట్ మాగ్నెట్ తయారీకి అవసరమైన పరిస్థితులను సృష్టించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొంది. విద్యుత్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో రేర్ ఎర్త్ పర్మినెంట్ మాగ్నెట్స్ కీలకం. ప్రస్తుతం అవసరాలు 2030 నాటికి రెట్టింపు కానున్నాయనేది అంచనా. ప్రస్తుతం వీటి కోసం దిగుమతులపై ఆధారపడుతుండగా.. దేశీయంగా వీటి సరఫరా గొలుసును సృష్టించి దిగుమతులను తగ్గించేందుకు తాజా కారిడార్ ఏర్పాటు చేయనుంది.

# 'ఆరెంజ్ ఎకానమీ'కి బూస్ట్

## .. దేశవ్యాప్తంగా కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లు

సృజనాత్మకత ఉన్న యువతే దేశానికి అసలైన ఆస్తి అని.. కంటెంట్ క్రియేటర్లను ప్రోత్సహిస్తామని ప్రధాని మోదీ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ దిశగా అడుగులు వేసిన ప్రభుత్వం సృజనాత్మక రంగాలకు పెద్దపీట వేసే ప్రయత్నం చేసింది. 'ఆరెంజ్ ఎకానమీ' లక్ష్యంగా ఆయా రంగాల్లో సృజనాత్మకతను ప్రోత్సహించి, భవిష్యత్తులో సృష్టించే ఉపాధి అవకాశాలకు సరిపడే నైపుణ్యాలతో సిద్ధంగా ఉండేందుకు చర్యలు చేపడుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ (Budget 2026) ప్రసంగంలో పేర్కొన్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**--ఆరెంజ్ ఎకానమీ..?...** మీడియా, వినోదం, మేధోసంపత్తి వంటి క్రియేటివ్ రంగాలను సూచించే పదమే ఆరెంజ్ ఎకానమీ. భౌతిక ఉత్పత్తుల కన్నా ప్రధానంగా సృజనాత్మకత, ఆలోచనలు, సాంస్కృతిక సంపద నుంచి వచ్చే విలువను ఇలా పేర్కొంటారు. యానిమేషన్, వీఎఫ్ఎక్స్, గేమింగ్, కామిక్స్, డిజైన్, టూరిజం, వినోదం వంటి రంగాలు ఇందులోకి వస్తాయి.


**--20లక్షల నిపుణులు అవసరం....** యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (AVGC) రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, 2030 నాటికి 20లక్షల మంది నిపుణులు అవసరమని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ మేర డిమాండ్‌ను అందుకునేందుకు వీలుగా.. ముంబయిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (IICT) నేతృత్వంలో దేశవ్యాప్తంగా 15వేల పాఠశాలలు, 500 కాలేజీల్లో ఏవీజీసీ కంటెంట్ క్రియేటర్ ల్యాబ్ లను ఏర్పాటు చేయాలని తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించింది. స్టార్టప్‌లను ప్రోత్సహించడం, డిజిటల్, సృజనాత్మక రంగాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించడం, కొత్తతరం సృష్టికర్తలను పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటితోపాటు తూర్పు భారతంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (NID)ని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి వెల్లడించారు. దేశంలో డిజైన్ రంగం వేగంగా విస్తరిస్తున్నప్పటికీ.. శిక్షణ పొందిన డిజైనర్ల కొరత ఉందన్నారు.

**--ఆర్థిక సర్వే సూచనలకు అనుగుణంగా....** దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి సృజనాత్మక ఆధారిత రంగాలే చోదకాలని ఆర్థిక సర్వే పేర్కొంది. ఉపాధి కల్పన, పట్టణ సేవలు, పర్యటక రంగాలకు కీలకమని చెప్పింది. ఈ రంగాలకు అపారమైన వృద్ధి సామర్థ్యాలు ఉన్నాయని పేర్కొంది. అయితే, పరిమిత కేంద్రాలు, నైపుణ్యాల్లో అంతరాలు, నియంత్రణ అడ్డంకులు వంటి సవాళ్లు ఉన్నాయని, ఇందుకోసం విధానపరమైన మద్దతు అవసరమని సూచించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తాజా ప్రతిపాదనలు చేసింది.


# నన్ను నడిపించేది సినిమా పాటలే

తనలో ఉన్న కళలన్నింటినీ బయట పెట్టాల్సిన అవసరం లేదని అంటోంది కథానాయిక శ్రుతి హాసన్. తనదైన నటనతో ఆకట్టుకుంటూనే.. గాయనిగా కూడా సినీప్రియుల్ని అలరిస్తుందీమె. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రుతి మాట్లాడుతూ.. "నాకు విభిన్న మార్గాల్లో నడవడం ఇష్టం. ఒకే గుర్తింపులో నన్ను నేను బంధించాలనుకోవట్లేదు. నాకు సంగీతం, నటన, రచన అంటే చాలా ఇష్టం. అయినప్పటికీ అన్నింటి కన్నా ముందు నటిగా ఉండటానికే ఇష్టపడతా. నాకు అదే ఆనందాన్నిస్తుంది. శారీరక శ్రమతో కూడిన పాత్రలు చేయాలనే కోరిక ఉంది. సినిమా నా వృత్తి జీవితంలో ఒక భాగం. కానీ సంగీతం నా వ్యక్తిగత విషయం. సినిమా నాకు ప్రజలతో ఎలా ఉండాలో నేర్పించింది. ఆ పాటాలే ఒక సంగీతకారిణిగా, మనిషిగా నన్ను ముందుకు నడిపిస్తున్నాయ"ని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె.. విజయ్ సేతుపతితో కలిసి నటించిన 'ట్రైన్' విడుదలకు సిద్ధంగా ఉంది. దీంతో పాటు 'ఆకాశంలో ఒక తార', 'సలార్ 2' లాంటి చిత్రాలు శ్రుతి ఖాతాలో ఉన్నాయి.





## అందమైన ప్రేమకథతో..



కథానాయకుడు సాయిదుర్గా తేజ్ ప్రస్తుతం 'సంబరాల ఏటి గట్టు' సినిమాతో సెట్స్‌పై తీరిక లేకుండా గడుపుతున్నారు. ప్రస్తుతం ఇది ముగింపు దశకు చేరుకుంది. ఈ చిత్రం పూర్తయిన వెంటనే కొద్ది నెలల గ్యాప్‌లోనే మరో కొత్త సినిమాని పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సినిమాతో హీరో ప్రభాస్ కజిన్ సిద్ధార్థ్ రాజ్‌కుమార్ దర్శకుడిగా పరిచయం కానున్నట్లు సమాచారం. ఇదొక అందమైన ప్రేమకథతో ముస్తాబు కానుందని.. దీంట్లో సాయితేజ్ లవర్‌బాయ్‌లా క్లాస్ లుక్‌లో కనిపించనున్నారని తెలిసింది. ఈ పాత్ర కోసం ఆయన పూర్తిగా బరువు తగ్గనున్నట్లు తెలుస్తోంది. దీన్ని రెండు ప్రముఖ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మించనున్నాయి. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది.

# సీనియర్ నటుడు రఘునాథ రెడ్డి ఇకలేరు



తెలుగు చిత్ర పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. తనదైన విలక్షణ నటనతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటుడు కె. రఘునాథ రెడ్డి (82) శనివారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో హైదరాబాద్‌లోని తన ఇంట్లో కన్నుమూశారు. ఆయన భార్య అన్నపూర్ణ. వీరికి సుధాలక్ష్మి, అరుణ, సుధాకర్ రెడ్డి ముగ్గురు సంతానం. గతేడాది డిసెంబరులో కొడుకు సుధాకర్ గుండెపోటుతో మరణించగా.. అప్పటి నుంచి రఘునాథ రెడ్డి మానసికంగా బాగా కుంగిపోయారు. ఈక్రమంలోనే ఆయన శనివారం బ్రెయిన్ స్ట్రోక్‌తో తుదిశ్వాస విడిచారు. ఆదివారం అంత్యక్రియలు పూర్తయ్యాయి.

**––రంగస్థలం నుంచి వెండితెరపైకి..**

సహాయ నటుడిగా తెలుగు, తమిళంతో పాటు హిందీ భాషలోనూ నటించిన రఘునాథ రెడ్డి.. మూడున్నర దశాబ్దాల సినీ ప్రయాణంలో దాదాపు 370కి పైగా సినిమాలు, పలు బుల్లితెర ధారావాహికల్లో సందడి చేశారు. కృష్ణా జిల్లా కుందేరులో జన్మించిన ఆయన.. సౌత్ సెంట్రల్ రైల్వేలోని లాలాగూడ వర్క్‌షాప్‌లో కొన్నాళ్లు పని చేశారు. ఆ సమయంలోనే శ్రీహరి మూర్తి, టి.శివరామ కృష్ణ ప్రోత్సాహంతో నాటక రంగం వైపు అడుగులు వేశారు. 'ఆకాశ రామన్న', 'పునరపి జననం', 'సంధ్యా ఛాయా', 'సాలభంజికలు', 'రాణి రుద్రమ', 'శ్రీకృష్ణ తులాభారం' లాంటి నాటకాల్లో విభిన్నమైన పాత్రలతో మెప్పించారు. ఎంవీ రఘు దర్శకత్వంలో వచ్చిన 'కళ్లు' సినిమాతో నటుడిగా వెండితెరకు పరిచయమయ్యారు. 1991లో వచ్చిన 'సర్పయాగం'తో చిత్రసీమ దృష్టిని ఆకర్షించారు. ఇక అక్కడి నుంచి తెరపై తండ్రిగా, పోలీసు అధికారిగా, న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా, వైద్యుడిగా.. ప్రతి పాత్రకు న్యాయం చేశారు. ఈక్రమంలోనే 'మదరిండియా', 'ఒరేయ్ రిక్షా', 'యమ్.ధర్మరాజు ఎం.ఎ', 'యమజాతకుడు', 'పెళ్లి పందిరి', 'చూడాలని ఉంది', 'రాజకుమారుడు', 'మల్లీశ్వరి', 'బొమ్మరిల్లు'.. ఇలా ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో భాగమయ్యారు. గతంలో మూడు సార్లు బ్రెయిన్ స్ట్రోక్‌కి గురవ్వడంతో కొన్నేళ్లుగా సినిమాలకు దూరమయ్యారు. ఆయన 'సుబ్రహ్మణ్యపురం' (2018) సినిమాలో చివరి సారిగా నటించారు.

## జాబిలి ప్రేమ మొదలైంది



విద్యార్థి జీవితం, ప్రేమ, కలలు.. లాంటి అంశాలతో యువతను ఆకట్టుకోవడానికి మరో సినిమా ముస్తాబవుతోంది. అదే 'హైకూ'. 'కోర్ట్' చిత్రంలో జాబిలిగా కనిపించి యువతను అలరించిన కథానాయిక శ్రీదేవి, ఏగన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. యువరాజ్ చిన్నసామి దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా పోస్టర్లకు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభమైనట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఫొటోలను పంచుకుంది చిత్రబృందం. "ఈరోజు 'హైకూ' ప్రేమ ప్రారంభమైంది. అద్భుతమైన తారాగాణం, కథతో మీ ముందుకు రాబోతున్నామ"నే వ్యాఖ్యను జోడించింది. రొమాంటిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో ఫెమినా జార్జ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. విజయ్ బుల్గానిన్ సంగీతమందిస్తున్నారు.

# నవ్వులు పంచే లగ్గం టైమ్

"ఆద్యంతం వినోదాత్మకంగా సాగే సినిమా 'లగ్గం టైమ్'' అన్నారు దర్శకుడు ప్రజోత్ కె. వెన్నం. ఆయన దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రాజేశ్ మేరు, నవ్య చిట్యాల జంటగా నటించారు. కె.హిమబిందు నిర్మించారు. ఈ సినిమా ఈనెల 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు ప్రజోత్ మాట్లాడుతూ.. "అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునే మంచి కథతో రూపొందిన చిత్రమిది. తప్పకుండా ప్రతి ఒక్కరూ మెచ్చుకునేలా ఉంటుంది'' అన్నారు. "ఎన్నో వ్యయప్రయాసలు పడి ఈ చిత్రాన్ని నిర్మించాం. దీన్ని చూసి ప్రేక్షకులు థియేటర్ నుంచి మనస్ఫూర్తిగా నవ్వుతూ బయటకు వస్తారని నమ్మకంగా చెప్పగలను'' అన్నారు నిర్మాత హిమబిందు. ఈ కార్యక్రమంలో రాజేశ్, కృష్ణప్రసాద్, విశ్వనాథ్, పవన్, రెతీషా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# వెంటాడే 'హనీ'

"ప్రేక్షకులకు ఓ విభిన్నమైన అనుభూతిని పంచిచ్చే సినిమా 'హనీ'. కచ్చితంగా ఇది మౌత్ టాక్‌తో నిలబడే సినిమా అవుతుంది'' అన్నారు హీరో నవీన్ చంద్ర. ఆయన.. దివ్య పిళ్లై జంటగా నటించిన ఈ చిత్రాన్ని కరుణ కుమార్ తెరకెక్కించారు. రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ఈనెల 6న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ.. "అందర్నీ వెంటాడే చిత్రమిది. ఆలోచన రేకెత్తించేలా ఉంటుంది. దీంట్లో ఓ చీకటి సమాజాన్ని చూపించాం'' అన్నారు.

# ప్రాణస్నేహితులుగా?



"టైగర్ కా హుకుం'' అంటూ అభిమానుల్ని అలరించే అగ్రహీరో... తన యాక్షన్‌తో థియేటర్లలో విజిల్స్ వేయించుకునే మరో కథానాయకుడు... వీరిద్దరూ కలిస్తే అభిమానులకు పండగే కదా! అలాంటి వేడుకను ప్రేక్షకులకు పరిచయం చేయడానికి సన్నద్ధమవుతున్నారు రజనీకాంత్, షారుక్ ఖాన్. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రజనీ హీరోగా 'జైలర్ 2' తెరకెక్కుతుంది. యాక్షన్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో షారుక్ అతిథి పాత్రలో మెరవనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే తాజాగా ఆయన పాత్ర గురించి మరో ఆసక్తికర విషయం నెట్టింట్లో సందడి చేస్తోంది. ఈ చిత్రంలో షారుక్.. రజనీకాంత్ ప్రాణ స్నేహితుడిగా, సన్నిహితుడిగా కనిపించనున్నారని, ఆయన పాత్ర సినిమాకే కీలకంగా నిలవనుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# వారి ఆశీస్సుల వల్లే నేనీ స్థాయిలో ఉన్నా: బ్రహ్మానందం

ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం 70వ పుట్టినరోజు వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు . ఈ ఈవెంట్‌లో పలువురు నటులు సందడి చేశారు. ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు తదితర రాజకీయ ప్రముఖులూ హాజరై, బ్రహ్మానందానికి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో ఆయన్ను సన్మానించారు. ఎల్బీ శ్రీరామ్, బాబు మోహన్, ఉత్తేజ్, రఘుబాబు, పృథ్వీరాజ్, రచ్చ రవి, సంపూర్ణేశ్ బాబు, ప్రగతి తదితరులు బ్రహ్మానందంపై అభిమానాన్ని చాటుకున్నారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "బ్రహ్మానందంలో నేను కమెడియన్‌ను చూడలేదు. నటుడిని మాత్రమే చూశా. ఎన్నో పాత్రలు పోషించిన ఆయన్ను.. రోజూ తలచుకోని వారంటూ ఉండరు. తెలుగు వారి హృదయాల్లో బ్రహ్మానందం చిరస్థాయిగా నిలిచారు. ఆయన గొప్ప వ్యక్తి'' అని రఘురామ రామకృష్ణరాజు కొనియాడారు.

**––అది నా గొప్పతనం కాదు: బ్రహ్మానందం**

"42 ఏళ్ల సుదీర్ఘ నట ప్రయాణంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా. మీ అందరి అభిమానాన్ని పొందగలిగా. ఇన్నేళ్లపాటు కొనసాగుతున్నానంటే అది నా గొప్పతనం కాదు ప్రేక్షకులది. వారి ఆశీస్సులు లేకపోతే నేనీ స్థాయిలో ఉండేవాడిని కాదు. తెలుగు కళామతల్లికి, మేకర్స్‌కు కృతజ్ఞతలు. నేను ఎక్కువ సినిమాల్లో నటించడం నా గొప్పతనం కాదు అన్ని చిత్రాలు రూపొందించిన దర్శక, నిర్మాతలది. నేను చిత్ర పరిశ్రమలోకి రావడానికి కారణం దర్శకుడు జంధ్యాల, నటుడు చిరంజీవి, నిర్మాత రామానాయుడు. నా ప్రతిభను గుర్తించిన చిరంజీవి తనతోపాటు తీసుకెళ్లి మరీ ఎంతోమంది సినిమా ప్రముఖులకు నన్ను పరిచయం చేశారు. జంధ్యాల తెరకెక్కించిన 'అహనా పెళ్లంట'లో కోట శ్రీనివాసరావుకు అసిస్టెంట్‌గా నటించా. ఆ చిత్రం పెద్ద విజయం కావడంతో నాకు మంచి పేరొచ్చింది. తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు'' అని బ్రహ్మానందం అన్నారు.



# దేవిక ధమాకా



అంచనాలకు మించి రాణించిన భారత రైజింగ్ స్టార్ షట్లర్ దేవిక సిహాగ్ తన కెరీర్‌లోనే గొప్ప విజయాన్ని అందుకుంది. ఆదివారం ముగిసిన థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో దేవిక చాంపియన్‌గా అవతరించింది. హరియాణాకు చెందిన 20 ఏళ్ల దేవిక కెరీర్‌లో ఇదే తొలి సూపర్-300 టైటిల్ కావడం విశేషం. ప్రపంచ 68వ ర్యాంకర్, రెండుసార్లు జూనియర్ వరల్డ్ చాంపియన్ గో జిన్ వె (మలేసియా)తో జరిగిన ఫైనల్లో దేవిక తొలి గేమ్‌ను 21-8తో సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో 6-3తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ దశలో గాయం కారణంగా గో జిన్ వె మ్యాచ్ నుంచి వైదొలిగింది. దాంతో దేవికకు టైటిల్ ఖరారైంది. విజేత దేవికకు 18,750 డాలర్ల (రూ. 17 లక్షల 19 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 7000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. పీవీ సింధు, సైనా నెహ్వాల్ తర్వాత థాయ్‌లాండ్ సూపర్-300 టైటిల్ నెగ్గిన మూడో భారతీయ క్రీడాకారిణిగా దేవిక గుర్తింపు పొందింది. టైటిల్ గెలిచే క్రమంలో దేవిక తన ప్రత్యర్థులకు ఒక్క గేమ్ కూడా కోల్పోకపోవడం విశేషం. ఈ టైటిల్‌తో ప్రపంచ 63వ ర్యాంకర్ దేవిక మంగళవారం విడుదల చేసే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్-40లో చోటు సంపాదిస్తుంది. 'చాలా ఆనందంగా ఉంది. నా కెరీర్‌లో ఇదే తొలి సూపర్-300 లెవెల్ టైటిల్. ఈ సీజన్‌లో మరిన్ని టోర్నీలు ఆడతాను. థాయ్‌లాండ్ ఓపెన్‌లో అన్ని మ్యాచ్‌లు బాగా ఆడాను. కొత్త పాఠాలు నేర్చుకున్నాను. ఫైనల్లో గెలుపోటములు గురించి ఆలోచించలేదు. నా అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలనే లక్ష్యంతో బరిలోకి దిగాను' అని దేవిక వ్యాఖ్యానించింది. బెంగళూరులోని పదుకొనే-ద్రవిడ్ సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్‌లో ఉమేంద్ర రాణా వద్ద దేవిక శిక్షణ తీసుకుంటోంది.

## ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా అల్కరాస్..



పురుషుల టెన్నిస్‌లో కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేసిన అతిపిన్నవయస్కుడిగా ప్రపంచ నంబర్ వన్ అల్కరాస్ (స్పెయిన్) చరిత్ర సృష్టించాడు. ఆదివారం హోరాహోరీగా సాగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో నొవాక్ జకోవిచ్ (సెర్బియా)పై 26, 62, 63, 75 తేడాతో అల్కరాస్ విజయం సాధించాడు. 22 ఏళ్ల అల్కరాస్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఇది తొలి టైటిల్. అతను ఇప్పటికే ఫ్రెంచ్ ఓపెన్ (2024, 2025), వింబుల్డన్ (2023, 2024), యూఎస్ ఓపెన్ (2022, 2025) టైటిళ్లు సాధించాడు. మరోవైపు.. జకోవిచ్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌లో ఇది తొలి ఓటమి. అంతకుముందు ఈ టోర్నమెంట్‌లో ఫైనల్ చేరిన పదిసార్లూ అతడు విజేతగా నిలవడం విశేషం. టెన్నిస్ చరిత్రలో అత్యధిక (25) గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లు సాధించాలనుకున్న జకోవిచ్ ఆశలపై అల్కరాస్ నీళ్లు చల్లాడు.

ప్రస్తుతం 24 టైటిళ్లతో ఉన్న నొవాక్.. 25వ టైటిల్ కోసం చాలా కష్టపడుతున్నాడు. చివరగా 2023లో యూఎస్ ఓపెన్ గెలిచాక.. అతడు మళ్లీ గ్రాండ్‌స్లామ్ కొట్టలేకపోతున్నాడు.

## టీ20 ప్రపంచ కప్‌నకు దూరం .. బంగ్లాదేశ్‌లో కొత్త టోర్నమెంట్



టీ20 ప్రపంచ కప్ 2026 (T20 World Cup)కు దూరమైన బంగ్లాదేశ్ తమ దేశ ఆటగాళ్ల కోసం కొత్త టీ20 టోర్నమెంట్‌ను ప్రారంభించనుంది. దీనికి ఓడోమ్మో బంగ్లాదేశ్ T20 కప్ 2026 (ODOMMO Bangladesh T20 Cup) అని పేరు పెట్టింది. 'ఓడోమ్మో' అంటే బంగ్లాలో అజేయమైన లేదా ఎవరికీ లొంగనిది అని అర్థం. ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు ఈ టోర్నీ జరగనుంది. మూడు జట్లు పోటీపడతాయి. ధూమ్‌కేతు XI జట్టుకు లిటన్ దాస్, దర్బార్ XI టీమ్‌కు నజ్ముల్ హుస్సేన్ శాంటో, దురంటో XI జట్టుకు అక్బర్ అలీ నాయకత్వం వహించనున్నారు. ప్రైజ్‌మనీ, ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులకు రూ.1.87 కోట్లు ఖర్చు చేస్తామని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధికారి తెలిపారు. మ్యాచ్‌లకు మరింత ఊపు తీసుకొచ్చేందుకు 'ఇంపాక్ట్ ప్లేయర్ రూల్'ను ఈ టోర్నీలో ప్రవేశపెట్టనున్నారు. ఫిబ్రవరి 5, 6, 7 తేదీల్లో గ్రూప్ దశ మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ నెల 9న ఫైనల్ నిర్వహిస్తారు. టీ20 ప్రపంచ కప్ 2026 ఈ నెల 7 నుంచి ప్రారంభంకానుంది. ఈ మెగా టోర్నీకి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. భారత్‌లో మ్యాచ్‌లు ఆడటానికి బంగ్లాదేశ్ నిరాకరించింది. దీంతో ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ప్రత్యామ్నాయ జట్టుగా ఆడించాలని ఐసీసీ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కొత్త టోర్నమెంట్‌ను ప్రారంభించాలని నిర్ణయించింది.

# క్రీడల్లో భారత్ విశ్వరూపం..

## పదేళ్ల లక్ష్యంతో 'ఖేలో ఇండియా మిషన్' ప్రారంభం

కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ 2026 లో భారతదేశాన్ని క్రీడల రంగంలో ప్రపంచ అగ్రగామిగా నిలబెట్టేందుకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రకటన చేసింది. గతంలో విజయవంతమైన 'ఖేలో ఇండియా' కార్యక్రమాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తూ, రాబోయే దశాబ్ద కాలంలో క్రీడా రంగాన్ని సమూలంగా మార్చే లక్ష్యంతో 'ఖేలో ఇండియా మిషన్' ను ప్రారంభిస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. క్రీడా రంగం కేవలం వినోదానికే పరిమితం కాకుండా, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలకు బలమైన వేదికగా నిలుస్తుందని ఆమె ఈ సందర్భంగా సభలో ప్రకటించారు. ఈ ఖేలో ఇండియా మిషన్ ద్వారా అట్టడుగు స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారికి ప్రపంచ స్థాయి శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. కోచ్‌లకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్ పరిశోధనలు, అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పన, నిరంతర క్రీడా పోటీల నిర్వహణపై ఈ మిషన్ ప్రధానంగా దృష్టి సారిస్తోంది. 2030 కామన్వెల్త్ గేమ్స్, 2036 ఒలింపిక్స్ ఆతిథ్యం కోసం భారత్ సిద్ధమవుతున్న తరుణంలో, ఈ 'ఖేలో ఇండియా మిషన్' క్రీడాకారుల తయారీలో కీలక పాత్ర పోషించనుంది.




## డబ్ల్యూపీఎల్..ప్లేఆఫ్ లోకి ఢిల్లీ



WPL 2026 సీజన్ లో ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల జట్టు ప్లేఆఫ్స్‌కు చేరింది. యూపీ వారియర్స్‌తో నేడు జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ 5 వికెట్ల తేడాతో విజయం సాధించి నాకౌట్ దశకు అర్హత పొందింది. ముందుగా బ్యాటింగ్ చేసిన యూపీ వారియర్స్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 122 పరుగులకే పరిమితమైంది. అనంతరం 123 పరుగుల టార్గెట్ తో బరిలోకి దిగిన ఢిల్లీ 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి సునాయాసంగా విజయాన్ని అందుకుంది. వోల్వార్ట్ (47), షెఫాలీ వర్మ (29), జెమీమా రోడ్రిగ్స్ (34) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఈ విజయంతో ఢిల్లీ 8 పాయింట్లతో పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరుకుంది. మంగళవారం జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో గుజరాత్, ఢిల్లీ తలపడనుండగా.. ఆ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఆర్సీబీతో ఫైనల్‌లో తలపడనుంది. ఇక లీగ్ దశలోనే 12 పాయింట్లు సాధించి RCB డైరెక్ట్ గా ఫైనల్ కి చేరుకున్న సంగతి తెలిసిందే.

## పాక్‌ను.. చిత్తుగా ఓడించిన భారత్



అండర్ 19 ప్రపంచకప్ 2026లో భాగంగా ఇవాళ (ఫిబ్రవరి 1) జరిగిన మ్యాచ్‌లో భారత్ పాకిస్తాన్‌పై 58 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో భారత్ సెమీఫైనల్‌కు కూడా అర్హత సాధించింది. బులవాయో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 49.5 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటైంది. వేదాంత్ త్రివేది (68) బాధ్యతాయుతమైన అర్ధ సెంచరీతో భారత్‌కు గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. ఆఖర్లో కనిష్క్ చౌహాన్ (35), ఖిలన్ పటేల్ (21) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. భారత బ్యాటర్లలో ఆరోన్ జార్జ్ (16), కెప్టెన్ ఆయుశ్ మాత్రే (0), అభిగ్యాన్ కుందు (16), దీపేశ్ దేవేంద్రన్ (1) విఫలం కాగా.. వైభవ్ సూర్యవంశీ (30), విహాన్ మల్హోత్రా (21), అంబ్రిష్ (29) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. పాక్ బౌలర్లలో అబ్దుల్ సుభాన్ 3, మొహమ్మద్ సయ్యద్ 2, అలీ రజా, అహ్మద్ హుసేన్, మొమిన్ ఖమార్, అలీ హస్సన్ బలోచ్ తలో వికెట్ తీశారు. అనంతరం ఓ మోస్తరు లక్ష్య ఛేదనలో పాక్ తొలుత విజయం దిశగా సాగింది. అయితే మధ్యలో భారత స్పిన్నర్లు ఖిలన్ పటేల్ (9.21353), ఆయుశ్ మాత్రే (8 0213), కనిష్క్ చౌహాన్ (101301), విహాన్ మల్హాత్రా (40151) చెలరేగడంతో పాక్‌కు ఓటమి తప్పలేదు. పేసర్లు అంబ్రిష్ (5026 1), హెనిల్ పటేల్ (50301) కూడా రాణించడంతో పాక్ 46.2 ఓవర్లలో 194 పరుగులకే ఆలౌటైంది. పాక్ ఇన్నింగ్స్‌లో ఉస్మాన్ ఖాన్ (66) ఒక్కడే అర్ధ సెంచరీతో రాణించాడు. హమ్జా జహూర్ (42), కెప్టెన్ ఫర్హాన్ యూసఫ్ (38) ఓ మోస్తరు స్కోర్లతో పర్వాలేదనిపించగా.. మిగతా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. ఈ ఓటమితో పాక్ ప్రపంచకప్ నుంచి నిష్క్రమించగా.. గ్రూప్ 2 నుంచి భారత్, ఇంగ్లండ్ సెమీస్‌కు అర్హత సాధించాయి. గ్రూప్ 1 నుంచి ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్ సెమీస్ బెర్త్‌లు దక్కించుకున్నాయి. ఫిబ్రవరి 4న జరిగే రెండో సెమీఫైనల్లో ఆఫ్ఘనిస్తాన్ భారత్‌ను ఢీకొంటుంది. 3న జరిగే తొలి సెమీఫైనల్లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ తలపడతాయి.

## హైజంప్‌లో శంకర్‌కు గోల్డ్ మెడల్

### ఒలింపిక్ మెడలిస్టును ఓడించిన ఇండియన్



ఒలింపిక్ మెడలిస్టుకు భారత హైజంపర్ తేజస్విన్ శంకర్ షాకిచ్చాడు. ఒలింపిక్స్‌తోపాటు వరల్డ్ ఇండోర్ ఛాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్స్ నెగ్గిన షెల్బీ మెక్‌ఈవెన్‌ను డిలాస్ డాడ్స్ ఇన్విటేషనల్ 2026 టోర్నీలో శంకర్ ఓడించాడు. కన్సాస్‌లోని మాన్‌హాటన్ వేదికగా జరిగిన ఈ టోర్నీలో 27 ఏళ్ల శంకర్ 2.26 మీటర్లతో గోల్డ్ మెడల్ కొట్టాడు. షెల్బీ 2.22 మీటర్లతో రెండో స్థానానికే పరిమితమయ్యాడు. మరో అమెరికన్ డెవిన్ లూడర్‌మిల్క్ కూడా 2.22 మీటర్లతో మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. గత మూడేళ్లలో శంకర్ బెస్ట్ జంప్ కూడా ఇదే కావడం గమనార్హం. 2023 ఇండోర్ గ్రాండ్ ప్రిక్స్‌లో కూడా శంకర్ 2.26 మీటర్ల జంప్‌తో ఆకట్టుకున్నాడు. కామన్‌వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకంతో మెరిసిన శంకర్.. తొలి ప్రయత్నంలో 2.05 మీటర్లు జంప్ చేశాడు. ఆ తర్వాత వరుసగా 2.10 మీ, 2.14 మీ, 2.18 మీ, 2.22 మీటర్ల జంప్స్ చేశాడు. చివరి ప్రయత్నంలో 2.26 మీటర్ల జంప్‌తో అగ్రస్థానం సాధించాడు. కాగా, 2018లో 2.29 మీటర్ల జంప్‌తో శంకర్ జాతీయ స్థాయిలో రికార్డు నెలకొల్పాడు. ఆ తర్వాత పలుమార్లు 2.30 మీటర్లు జంప్ కోసం ప్రయత్నించినా విఫలమయ్యాడు.